
నూరేళ్ళకథకు నీరాజనం



సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల,
కొత్తగూడెం

సంకలనకర్త : డా|| బి. కనకదుర్గ

నూరేళ్ళ కథకు నీరాజనం

సంకలనకర్త : డా॥ జె. కనకదుర్గ,
ప్రిన్సిపాల్

సంపాదకులు: డా॥ రాయదుర్గం విజయలక్ష్మి,
అధ్యాపకురాలు, తెలుగు శాఖ.

రచయితలు : విద్యార్థినులు మరియు జంకదు.
సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల,
కొత్తగూడెం

సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల
కొత్తగూడెం

నూరేళ్ళ కథకు నీరాజనం

ప్రచురణ : సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల
కొత్తగూడెం, ఖమ్మం జిల్లా

ప్రతులు : 200

వెల : అమూల్యం

ముఖచిత్రం : షేక్ మౌలానా, చిత్రలేఖనోపాధ్యాయులు
సిం॥కా॥ ఉన్నత పాఠశాల, కొత్తగూడెం.

ముద్రణ : తాహెర్ గ్రాఫిక్స్, కొత్తగూడెం

సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటి,
కొత్తగూడెం వారి అభినందనలతో....

విషయసూచిక

ముందుమాట

ఆధునిక సాహితీవేత్తలు వందేళ్ళ కథకి వందనం చేస్తుంటే సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల నూరేళ్ళ కథకొక నీరాజనం పట్టాలనుకుంది. కథలను చదవటమేకాక కథలు వ్రాయలనే సంకల్పాన్ని కలిగించిన కథాభారతికి సింగరేణి కాలరీస్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు స్వీయ రచనలతో హారతి పట్టాలన్న ప్రయత్నానికి అక్షరరూపమే ఈ కథాసంపుటి. మానవజీవన విధానంలోని సూక్ష్మాతి సూక్షమైన అనుభూతులకు ఆలోచనలకు సామాజిక సంస్కృతికి అద్దంపటే సాహితి ప్రక్రియ ఒక్క కథాసృజనయే. అనాదిగా మానవులు తమ ఆలోచనలను అనుభూతులను పంచుకునే క్రమంలో ఎన్నో చిన్నికథలు పుట్టాయి. అవి కావ్యం లోని ప్రధాన కథకు అనుసంధానంగా సంధర్భానుసారంగా పద్యాలరూపంలో ఉన్నాయి. ఆధునిక కాలంలోని మానవజీవన విధానంలో మార్పులను తెచ్చిపెట్టిన ఏఒక్కఅనుభూతియైన హృదయాన్ని స్పందింపచేస్తే అది నిర్దిష్ట జీవనకోణాన్ని స్పృశిస్తే అది దిద్దుబాటు రూపంలో కథాప్రక్రియగా చైతన్యాన్ని కలిగించింది. బండారు అచ్చమాంబ సృష్టించిన కథాసాహిత్యవేదికపై కథాభారతి పట్టంకట్టించుకుంటూ సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల హృదయభూమికలపై నూరేళ్ళహారతికి నిలువుటద్దమై నిలిచింది. సింగరేణి బొగ్గుగనుల ప్రాంతాలలో కథావజ్రాలు కాంతులీనుతుంటే సింగరేణి మహిళాకళాశాల విద్యార్థినులు నూరేళ్ళ కథాసరస్వతికి సింగరేణి చిరుకానుకను అందించేదిశగా ఈ కథాసంపుటితో నిండునూరేళ్ళు నీరాజనం పట్టాలనుకునే ప్రయత్నంలో భాగంగా రూపాన్ని సంతరిచుకున్న ఈ కథాసంపుటి ప్రశంసనీయం.

అన్నిరంగాలలో మహిళలు పురుషులతో సమానమే అనేచైతన్యంతో వ్రాసిన "పితృణం", "ఆదర్శమహిళ" వంటి కథలు, "పచ్చని వేదన" లోని పర్యావరణం పట్ల వున్ననిబద్ధతకు, "అపురూపమైన అనుభవాల" కు అద్దంపట్టే కథలు పురిటికందులైనప్పటికి విచ్చుకున్న కళ్ళతో లోకాన్ని చూస్తూ రచయితల హృదయనేత్రాలకు ఆనవాళ్ళుగా నిలుస్తాయి.

జె.క.దు

(డా॥ జె. కనకదుర్గ)

ప్రిన్సిపాల్

పచ్చని వేదన

ఆర్. కల్పన, ప్రథమ బి.జడ్.సి.

నేను చిన్న చిన్న కొమ్మలతో, లేత లేత ఆకులతో ముద్దొచ్చే చిన్న మొక్కను. నేను మా అమ్మ భూమాత ఒడిలో, పిల్లగాలి జోలలలో సుకుమారంగా పెరుగుతున్నాను. తుమ్మెదలు, రంగురంగుల సీతాకోక చిలకలతో హాయిగా ఆడుకుంటున్నాను. నన్ను పక్షులన్నీ పలకరిస్తూ ఉంటాయి.

నా చుట్టూ ఉన్న పెద్ద, పెద్ద వృక్షాలను, వాటి ఫలాలను, పుష్పాలను చూసి నేను కూడా భవిష్యత్తులో అంతటిదాన్ని అవుతానని మురిసిపోతుంటాను.

నేను పెద్ద వృక్షాన్ని అయి అన్ని రకాల పక్షులకు 'సమైక్య నిలయాన్ని' అవుతానని ఆశపడిపోయాను. తేనెటీగలకు నా పుష్పాల ద్వారా తియ్యటి మకరందాన్ని అందించాలనుకున్నాను. నా మధుర ఫలాలతో మనుష్యులకు, పక్షులకు ఆనందాన్ని పంచాలనుకున్నాను. అలుపెరిగిన బాటసారులను, పశులకాపరులను, జంతువులకు నా విశాలమైన కొమ్మల నీడలో సేదతీర్చాలని అనుకున్నాను. చల్లటి గాలులతో జోలపాటలు పాడి హాయిని అందించాలనుకున్నాను.

ఇలాంటి రంగుల కలలతో ఎన్నో ఆశలతో పెరుగుతున్నాను. కాలుష్యం పెరగడం, వేసవి కాలం, రావటంతో దీన్ని తట్టుకోలేని నా లేత శరీరం ఆకుల్ని రాల్చుతూ, నీరసిస్తూంది.

ఇంకా ప్రపంచానికి ప్రాణ వాయువును పంచాలనే నా కోరిక తీరనేలేదు. ఇతరులకు సహాయపడాలనే ఆశలు అలాగే ఆగి నన్నే చూస్తున్నాయి.

నేను ఏమి చేయలేక పోతున్నాను. "నీరసించిపోతున్న నా శరీరంతోపాటు రాలుతున్నది నా ఆకులు మాత్రమేనా? కాదు. నా ఆశలు కూడా రాలిపోతున్నాయి". "వర్షాకాలంలో నేను మరల చిగురిస్తాలే అనుకున్నాను. కాని కాలుష్యం వల్ల ఋతువులు మారాయి వర్షం నాకు జీవధార పోయలేనంటూ కాలుష్యంలో కొట్టుకుపోయింది. వసంతం కోసం ఆత్రుతలో ఎదురు చూశాను. అది 'నా మీద జాలితో చేయి అందించాలని ప్రయత్నించిన కాలుష్య భూతం వసంతాన్ని నలిపేసింది.

అందరికీ సహాయం చేయాలనుకున్న నాకు, ఏవీ సహాయం చేయలేనని నాకు తెలుస్తూనే ఉంది.

"ఆకులన్ని రాలి పోయి నా ఆశలతోపాటు"

"నాలో మిగిలిన కొన ప్రాణం ఒక చిన్న జీవికైనా సహాయం చేయలేదే అని మౌనంగా రోదిస్తుంది".

నా వేర్ల నుంచి మొదలైన చెదలు నన్ను చేరుకుంది. అది క్రింది నుంచి "నన్ను హరిస్తూ వస్తున్నా, దీనికైనా ఉపయోగపడగల్గుతున్నాననుకున్నాను"

ప్రాణ వాయువును పంచాలనుకున్న నా కోరిక ఎలాగూ తీరలేదు. నేను ఎవరికీ నీడను ఇవ్వలేను. నేను మరణించాక ఎవరైన నా కర్రను గృహంలా మార్చుకోవడానికి ఉపయోగించుకుంటే నా ఆత్మ తృప్తి చెందుతుంది. కనీసం ఈ ఆశ కూడా తీరదా? ఎవరూ నన్ను మంచి పనికి ఉపయోగించుకోరా? ఆశగా నిరీక్షిస్తున్నాను.

ఒక రోజు నేను తీక్షగా అలా చూస్తుండగా, దూరంగా గొడ్డలి పట్టుకుని ఒక నిరుపేద ఇటువైపు రావడం గమనించాను. అరే! అతను నా వైపుకే ఆశగా వస్తున్నాడు. నాతో అతనికి ఎంతో అవసరం ఉందని నాకు అర్థమైంది. అతనికి గృహానికి ఉపయోగపడబోతున్నాను. నా ఆశతీరే సమయం వచ్చేసింది, నా కోరిక తీరబోతుంది. ఈ ఆనందాన్ని ఆపుకోలేక పోతున్నాను.

నేను "ఈ మనిషికి ఉపయోగపడబోతున్నాను" ఈ సంతోషకరమైన విషయాన్ని "ఎవరెస్టు శిఖరం పైన నిల్చుని నలుదిక్కులా వినిపించేలా అరవాలని ఉంది" నా మనసుకు చిగురులు తొడిగినట్టుగా ఉంది.

ఆ మనిషి నన్ను చేరాడు. అతడిని నేను సహాయపడబోతున్నానన్న సంతోషం ముందు నన్ను నరికి వేస్తున్నాడన్ని బాధ మాయమైపోతుంది.

ఆ మనిషి నా కర్రను నెత్తిన వేసుకొని శిథిలమైన ఇంటిని చేరాడు. అతనికి ఇల్లునై శాశ్వతంగా అతనికి, అతని కుటుంబానికి నీడను ఇవ్వబోతున్నానని లోలోపల మురిసిపోయాను.

అదిగో సరిగా అప్పుడే.........అంతలోనే..........నా కలలు శాశ్వతకలలుగానే మిగిలాయి. అతని భార్య నన్ను పొయ్యి క్రింది మంటలో

చేర్చింది. నేను మండి విషవాయువులలో కూడిన పొగలను వెదజల్లాను.

అయ్యో ప్రాణవాయువును పంచాలనుకున్న నా ఆశ ఏది? ఏమైంది! నన్ను విషవాయువును చేసింది ఎవరు. కాలమా, కాలుష్యమా తన అవసరాలకై పరితపిస్సున్న మనిషా? ఎవరు? ఎవరు?

"నన్ను హరిత రూపం నుంచి కాలుష్య రూపంలోకి మార్చిందెవరూ"?

" ఆ ఆశలు ఆరిపోయాయి.

నా కలలు కరిగి పోయాయి"

నేను ఎల్లవేలల మనిషి మంచికి సహాయపడాలని పరితపించానే!

మరి ఆ మనిషి ఏం చేశాడు?

మనిషి అవసరాలకు, అత్యవసరాలకు పోయి పర్యావరణాన్ని మార్చేస్తున్నాడు.

ఇంత చేసిన ఈ మనిషి (ల) మీద నాకు (పర్యావరణం లేదా ప్రకృతి) కోపం రావట్లేదు. మనిషి మీద పాపం అని జాలి వేస్తుంది. నిజం

ఈ మనిషి నాశనం చేసింది నా జీవితాన్ని ఆశలను మాత్రమేనా కాదు, కాదు. మనిషి తన జీవితాన్ని తానే నాశనం చేసుకుంటున్నాడు.

మనిషి విషమయం చేసింది నన్నేనా కాదు కానే కాదు తన చుట్టూ వాతావరణాన్ని విషమయం చేస్తున్నాడు.

మనిషి ఇలాగే చేస్తూ వెళ్తే ప్రపంచమంతా కాలుష్యంతో నిండిపోతుంది.

ఇదే కనుక జరిగితే కాలుష్యంతో మనిషి కొట్టుకపోతాడు.

అందుకే, ఓ మనుషుల్లారా ఇకనైనా మేల్కోండి చెట్లను పెంచండి - హరితాన్ని సాధించండి.

హరిత మయమైన ప్రకృతి మాత పై కాలుష్యపు దుప్పటిని కప్పి నలిపెయ్యొద్దు".

మనుషులంతా ఒక్కటే

జి. త్రివేణి, ప్రథమ ఎమ్.బి.సి.

అది ఒక కాలువగట్టున ఉన్న పల్లె. ఆ పల్లెలో వివిధ కులమతాల వారు నివసిస్తున్నారు. అందరూ పేదవారే వారిలో క్రైస్తవ మత స్థులే అధికం. ఆ పల్లెకు సమీపంలో పట్నమూ పల్లేకాని ఒక మధ్యరకం గ్రామం. పల్లె ప్రజలు నిత్యావరసరములకు ఆగ్రామమే ఆధారము. కాల్వ గట్టు పల్లెలో ఆనందం, కరుణ అనే భార్యాభర్తలు నివసిస్తున్నారు. వారి ఏకైక సంతానం జార్జి (4 సం॥ల వాడు)

కరుణకు తన మతమన్నా, ఏసు క్రీస్తు అన్నా అమితమైన భక్తి.

విజయవాడ సమీపంలో గుణదల ప్రాంతంలోనున్న మేరీ మాత క్రైస్తవులందరికీ ఆరాధ్యదేవత. ప్రతి సంవత్సరము గుణదలలో మేరీమాత ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. వివిధ ప్రదేశముల నుండి క్రైస్తవ భక్తులు మేరీమాత ఉత్సవాలలో పాల్గొని ప్రార్థన చేసి పవిత్ర జలాలను స్వీకరించి ధన్యులౌతుంటారు.

ఎప్పటివలే ఆ సంవత్సరం గుణదలలో మేరీమాత ఉత్సవాలు జరుగుతున్నాయి. కరుణకు ఉత్సవాలకు వెళ్లాలనే కోరిక కల్గింది. తన భర్త, బిడ్డతో ఉత్సవాలకు బయల్దేరింది. గుణదల చేరేసరికి పది గంటలు దాటింది. గుణదల సమీపంలోని గుట్టమీదనున్న మేరీమాత ఆలయం రంగు రంగు దీపాలతో, తోరణములతో అలంకరింపబడి శోభాయమానముగా ప్రకాశిస్తున్నది. గుట్ట క్రింద నుండి జన సమూహము చీమల బారులు తీరినట్లుగా మెట్లను ఎక్కి మేరిమాత ఆలయానికి పోతున్నారు. ఆనందం, కరుణలు కూడా జార్జితో కలిసి మెట్లు ఎక్కటం ప్రారంభించారు. మెట్లు సగభాగం ఎక్కారు. అలసిపోయిన జార్జి ఏడవడం ప్రారంభించాడు. ఆకలి ఆకలి అని అలమటిస్తున్నాడు. తల్లి సముదాయించడానికి ప్రయత్నిస్తోంది ఆకలి బాధను తట్టుకొన లేక జార్జి మారాం చేయుట ప్రారంభించాడు.

సాధారణంగా ఏదైనా జాతరలు, ఉత్సవాలు జరుగుతుంటే భక్తులతో పాటు భిక్షగాండ్రు కూడా అక్కడికి చేరి భక్తులు చేసే దానాలకు

ఆశపడుతుంటారు. మేరీ మాత దర్శనానికి కులమత భేదాలు లేకుండా అందరూ వస్తారు. అలాగే ఒక హిందువు అయిన ముసలి స్త్రీ కూడా వచ్చింది. జార్జి కూడా ఏడుపుమానలేదు. పోనీ ఏదైనా కొనిపెడదామంటే దగ్గరలో ఎక్కడా దుకాణాలేవు. వారు నడుస్తున్న దారికి ప్రక్కనే ఆ ముసలి స్త్రీ కూర్చొని ఉంది. జనంలో జార్జి ఏడుపు విన్నది. వెంటనే జార్జిని పిలిచి తన చేతిలో యున్న లడ్డు ఇచ్చింది. ఆమె ఇచ్చిన లడ్డును ఆత్రుతగా తింటం ప్రారంభించాడు జార్జి.

ఇంతలోనే, కరుణ తన బిడ్డను వెదకటం ప్రారంభించింది. ఇంతలో సగం లడ్డూను తింటూ వస్తున్న జార్జిని చూచింది. దగ్గరకు తీసుకొని "ఏం తింటున్నావ'ని అడిగింది. జార్జి 'లడ్డూ' అని చెప్పాడు. 'ఎక్కడిది? ఎవరిచ్చారు?" అని అడిగింది. జార్జి ముసలమ్మను చూపాడు. కరుణ అటు చూసింది. ముఖాన కాస్తంత కుంకుమబొట్టు, చేతులకు ఉన్న మట్టిగాజులు మెడలో మాంగల్యంతో ఉన్న ఒక హిందు స్త్రీని చూచిన కరుణకు ఆమె పై ఏహ్యాభావం ఏర్పడింది.

కరుణకు ఎక్కడ లేని కోపం వచ్చింది. తన కొడుకు చేసినది అపవిత్ర కార్యమని తలచింది. తన కొడుకును పవిత్ర జలాలతో పునీతుడిని చేయాలని భావించింది. దగ్గరలోయున్న ఫాస్టరును బ్రతిమిలాడి కొన్ని పవిత్ర జలాలు తెచ్చింది. ఆ జలాలను జార్జి నోటిలో పోసి పుక్కిలించి ఉమ్మివేయమంది. జార్జి నోటిలో తన వేళ్ళు దూర్చి అతడు మింగిన సగం లడ్డూను కూడా కక్కించటానికి ప్రయత్నించింది. తల్లిపెడుతున్న హింస భరించలేక జార్జి ఉక్కిరిబిక్కిరి అగుచున్నాడు. ఆనందం జరుగుతున్నదంతా చూస్తూ నిశ్చేష్టుడై నిలబడ్డాడు.

ఇంతలో సన్యాసి ఒకడు అచ్చటకు వచ్చాడు. కరుణ చేస్తున్నపని, జార్జి పడుతున్న బాధను గమనించాడు. వెంటనే కరుణ వద్దకు వచ్చి ఇలా ప్రశ్నించాడు.

"అమ్మా! బాబుకేమైందమ్మా! ఎందుకలా బాధపడుతున్నాడు. నీవు చేస్తున్నదేమిటి?" 'ఏం చెప్పనండీ! నా కొడుకు చేసిన అపవిత్రమైన పనికి ప్రాముశ్చిత్తం లేదు'. అన్నది కరుణ'. 'ఏం చేశాడమ్మా!'

"ఇంకా ఏం చేయాలి! పవిత్రమైన క్రైస్తవ మతంలో పుట్టి, ఒక హైందవ స్త్రీ ఇచ్చిన ఆహారాన్ని తింటున్నాడు! అన్నది కరుణ.

"అందులో తప్పేముందమ్మా! ఆకలిగా ఉందేమో! తింటున్నాడు".

"ఆపండి మి సమర్ధన! మేరీమాత దర్శనానికి వెళ్తూ, అపవిత్రమైన

ఆహారాన్ని తినటం తప్పుకాదా!" కోపంగా అన్నదామె.

"ఎంత అమాయకురాలవమ్మా! ఆకలితో ఉన్న బాలుడు ఎవరు ఇచ్చిన ఆహారమైన తినటంలో తప్పేముంది".

ఎందుకు లేదు! ఇచ్చినది హైందవస్త్రీ! ఇతర మతముల వారిచ్చిన ఆహారము తినుట మహాపచారము కాదా! క్రైస్తవ మత సంప్రదాయము మంట కలువ లేదా! అందుకే! అందుకే! పవిత్ర జలాలతో నాకొడుకు కడుపును కడిగి పవిత్రుణ్ణి చేస్తున్నాను"?

"పవిత్ర జలాలతో ప్రక్షాళన చేస్తే నీ కొడుకు పవిత్రుడౌతాడా?"

"తప్పకుండా ఔతాడు! మేరీమాత కరుణిస్తుంది. మేరీమాతా నా కొడుకును ఆశీర్వదించు, వాడు చేసిన పాపమును ప్రక్షాళన చేయి. నీ దర్శనం చేసికొని మొక్కు తీర్చుకుంటాను. పదకొండు కొవ్వొత్తులు వెలిగిస్తాను". మేరీమాతను కరుణించింది కరుణ.

"పిచ్చితల్లీ! నీవు ప్రతి రోజూ తినే ఆహారంలో ఉపయోగించే బియ్యం, పప్పులు, కూరగాయులు, ఎక్కడ నుంచి వస్తున్నాయమ్మా?" అడిగాడు సన్యాసి.

"పొరుగు గ్రామంలోని దుకాణాలలో కొని తెచ్చుకుంటాము".

"వాటిని అమ్మేవారెవమ్మా?"

"దుకాణదారులు"-వెంటనే బదులిచ్చింది కరుణ.

" వారందరూ ఒకే మతం వారా?" ఆ సన్యాసి అడిగిన అప్రశ్నకు కరుణ అంది

"కాకపోవచ్చు. మహమ్మదీయులు, క్రైస్తవులు, హిందువులు అందరూవున్నారు".

"నీ బిడ్డ ఆ స్త్రీ ఇచ్చిన లడ్డూ తిన్నాడనే కదా, నీవు పవిత్ర జలాలలతో అతణ్ణీ పునీతుణ్ని చేస్తున్నావు.

"అవును".

"మరి ఇతర మతస్థుల నుండి తెచ్చిన ఆహార పదార్థాలను తిన్ననీవు ఏ

పవిత్ర జలాలతో పునీతురాలవు అవుతావు?" సూటిగా అడిగాడు.

"అవి కొనకుండా ఎలా వస్తాయి?" అయోమయంగా అన్నది కరుణ.

"నిజమే! కాని దాన్యం పండించే రైతు హిందువు కావచ్చు. కూరగాయలు పండించే వారు, హిందువులు, మహమ్మదీయులు క్రైస్తవులో కావచ్చు. ఆ పదార్థాలన్నీ అపవిత్రమైనవే కదా!"

"కావచ్చు"

అన్యమతస్థుల శరీరాలను తాకుచూ వచ్చిన గాలి నీ శరీరాన్ని తాకుతుంది కదా! అప్పుడు నీ శరీరాన్ని ఏ పవిత్రజలాలతో పరిశుద్ధం చేస్తావు?–వదలకుండా ప్రశ్నించిన సన్యాసి మాటలకు కరుణ మౌనం వహించింది.

కాసేపు ఆగి, మళ్ళీ సన్యాసి తన వాదనను కొనసాగించాడు.

"అమ్మా నీవు నడిచే భూమి మీద అన్యమతస్థులు కూడా నడుస్తున్నారు. ఆ భూమిని తాకిన పాదాలను ఏ పవిత్ర జలాలతో, అగ్ని కణికలతో పునీతం చేస్తావు?"

"ఏమో స్వామీ! మీరు చెప్పిందంతా వింటుంటే నాకంతా అగమ్యగోచరంగా ఉంది".

"అమ్మా భగవంతుని సృష్టిలో అన్ని మతాలు ఒక్కటే! నీకు ఆరాధ్యదైవము ఏసుక్రీస్తైతే, హిందువులకు రాముడు, కృష్ణుడు, మహమ్మదీయులకు అల్లా, ఆరాధ్యదైవాలు, దేవతలందరూ బోధించేది ఒక్కటే. ఏమతమూ, అసత్యం, హింస, అధర్మములను ప్రోత్సహించవు. సర్వమత సమానత్వమును పాటించే వారే భగవంతునికి నిజమైన భక్తులు".

"ఐతే ఇంతకు మీరేమంటారు?"–కొంచెం నిస్సహాయంగా, కొంచెం నిర్లక్ష్యంగా అడిగింది కరుణ.

"నేనేమి అనటం లేదు! ఒక్కసారి మేరీమాత దర్శనానికి వచ్చిన ఆ జనసందోహాన్ని చూడు. వారందరూ క్రైస్తవులేనంటావా!"

"చుట్టూ తేరిపార చూచి లేరు! వారిలో హిందువులు కూడా ఉన్నట్లున్నారు" అంది కరుణ.

"మరివారు తమ మత ధర్మాన్ని ఆలోచించక మేరీమాత దర్శనానికి ఎందుకు వచ్చి ఉంటారనుకుంటున్నావు?" ప్రశ్నించాడు సన్యాసి

"ఏమో! నాకేమీ అర్థంకావడం లేదు"– అప్పటికీ ఆలోచనలోపడిన కరుణ అంది.

"ఆగమ్మా! ప్రతి ఒక్కరు తమ తమ మత సాంప్రదాయాలను అనుసరిస్తూ, అన్యమతములను కూడా గౌరవించడం మన భారతజాతి ఔన్నత్యము. మన మతముల కంటే ముందు మనము భారతీయులము. సర్వమత సమానత్వం భారతీయ సాంప్రదాయము, అజ్ఞానమనే అంధకారంలో మనము వేరొక విధంగా ఆలోచిస్తాము". ప్రశాంతంగా అన్నాడు సన్యాసి.

"స్వామీ! మీరెవ్వరో కాని! నాలోని అజ్ఞానాన్ని తొలగించేందుకు నాకు ప్రత్యక్షమైన మహానుభావులు, మీ సందేశం అనే పవిత్ర జలం నా శరీరాన్ని, ఆత్మను పునీతం చేశాయి. నాలోనున్న ఏహ్యభావాన్ని పారద్రోలి అందరినీ ప్రేమించటం నేర్చుకుంటాను." నిజాయితీగా అంది కరుణ.

"ఇప్పటికే కాలా తీతమౌతుంది. మేరీ మాత దర్శనానికే నేనూ వస్తున్నాను. నీ కొడుకు పేరేమిటమ్మా?" చిరుమందహాసంతో అన్నాడు సన్యాసి.

"జార్జి!" అంది కరుణ.

"నాయనా జార్జి! ఇటురా! నా వద్దనున్న ఈ పండ్లను తిని ఆకలి తీర్చుకో!" అంటూ జార్జికి పండ్లు ఇచ్చాడు సన్యాసి.

తాను చేసిన పనికి కొంచెం పశ్చాత్తాప పడింది కరుణ. ఇంతలో వారు నల్గురూ మేరీమాత ఆలయంలో ప్రవేశించారు. మేరీమాతయే స్వయంగా తనకు జ్ఞాన భోద చేసి అజ్ఞానమును తొలగించిందని ఆనందపరవశురాలైంది, కరుణ

(వరంగల్ రైల్వే స్టేషన్‌లో చూసిన ఒక సంఘటన కల్గించిన ప్రేరణ ఈ కథా రచనకు కారణం)

నిజమైన వారసత్వం

ఇ. అనూష, ప్రథమ ఎమ్.ఇ.సి.ఎస్

గోపయ్య నలుగురు అన్నదముల్లో పెద్దవాడు. చిన్నప్పటి నుండి తండ్రి, తమ్ములు కులవృత్తి చేసుకుంటే తానుమాత్రం సోమరిగా ఉండేవాడు. గోపయ్య వాళ్ళు జాలర్లు. అతనికి చేపలు పట్టవచ్చు కాని వెళ్ళేవాడు కాదు. జీవితంలో సుఖపడాలనుకొని, తన ఊరికి దూరంగా వున్న ఊర్లో ఒక సంబంధం చేసుకొని, ఇల్లరికం అల్లుడిగా వచ్చేశాడు. ఇక అసలు కష్టాలు అప్పుడు మొదలయ్యాయి.

ఇల్లరికం రావడం చేత ఆయింట్లో వాళ్ళు చాల చులకనగా చూసేవారు. అతని అత్తయ్య మాత్రం అల్లుడిగానే భావించేది గాదు. పైగా హీనంగా మాట్లాడేది. పేదరికంలో ఉన్నా అతని సోదరులందరూ వారి వారి భార్యలతో చాల ఆనందంగా ఉన్నారు. తిరిగి పుట్టింటికే వెళ్లి ఉందామంటే తమ్ములు చులకనగా మాట్లాడేవారు. పైగా తండ్రి మరణించిన తర్వాత, తమకున్న కొద్దిపాటి ఆస్తిని వాళ్లే పంచుకొన్నారు.

తన అత్తగారు మాత్రం గోపయ్య చేపలు పట్టుకొచ్చిన రోజు మాత్రమే అంత గంజిపోసేది. తన కూతురికి మాత్రం కడుపు నిండుగా అన్నీ పెట్టేది. ఆమె కూడా తల్లి పెత్తనాన్ని ఎదిరించలేక భర్త పట్ల ప్రేమ ను చూపడం తెలియక కాలం గడిపేది. కొన్నాళ్ళకు గోపయ్యకు సంతానం కలిగింది. అతనికి ఇద్దరు కుమార్తెలు, నలుగురు కుమారులు. అయినా అతని ఇల్లరికపుటల్లుడి పరిస్థితిలో మాత్రం మార్పు రాలేదు.

చిన్న కొడుకు పేరు రాజయ్య, ఇతను చిన్నప్పుడు చాలా అల్లరి పిల్లవాడు. వద్దన్న పని చేసేవాడు. ఎవరైనా చాక్‌లెట్స్, బిస్కెట్స్ వంటి తినుబండారాలు తెస్తేనే, మీతో స్నేహం చేస్తా అనేవాడు. ఇతను స్నేహితులతో 'దొప్ప' అనే ఆట ఆడేటప్పుడు, రాజయ్య దొంగ పెట్టేటప్పుడు, అందరు వెళ్ళి దాక్కునేవారు. కాని రాజయ్య దాక్కునే వాళ్లను పట్టుకోకుండా, తన ఇంటికి వెళ్ళి హాయిగా అన్నం తిని పడుకునేవాడు. స్నేహితులందరూ అతని కోసం వెతికి వెతికి చివరికి అతని ఇంటికి వెళతే అక్కడ హాయిగా, పడుకొని కనిపిస్తాడు.

స్నేహితులు లేపడానికి వస్తే అతని తల్లి పిల్లవాడిని హాయిగా పడుకోనివ్వరమ్మా! ఆటలేదు, ఏమిలేదు వెళ్ళండి. అనేది. ఈ ఆట మాత్రమే

కాదు. ఏ ఆట అయిన ఇతను ఇలాగే చేస్తాడు. అంత అల్లరి పిల్లవాడు. అయితే పెరిగిపెద్దవాడయిన తరువాత

రాజయ్య చాలా మంచివాడు గా మారాడు, ఇతరుల కష్టాన్ని తన కష్టంగా భావించి తన కున్నంతలో సహాయం చేసే గొప్ప హృదయం అతనిది. రాజయ్యకు, అతని తోబుట్టువులకు వివాహం జరిగిన తరువాత కూడ తండ్రి గోపయ్య ఇల్లరికపు కష్టాలు తీరలేదు. పైగా ఆ ముసలమ్మ అల్లుడినే కాకుండా తన మనుమలను కూడా బాధించేది. కాని రాజయ్య అంటే మాత్రం ప్రేమగా చూసుకునేది.

రాజయ్య భార్య స్వరూప పెద్ద అందంగా లేకపోయినా మనసు మంచిది. తన మామగారిని ఆయన అత్తగారు పెట్టే బాధలకు చలించేది. రాజయ్య భార్య గాబట్టి ఆ ముసలమ్మ స్వరూపకు అన్నం పెట్టేది. ఆ ముసలమ్మకు తెలియకుండా తన మామగారికి పెట్టి, తనుమాత్రం గంజి తాగి కడుపు నింపుకునేది.

కొన్నాళ్ళకు రాజయ్య వాళ్ళ నాన్న, అమ్మమ్మ ఒక్కొక్కరుగా మరణించారు. అన్నదమ్ములందరూ తల్లిని రాజయ్యకే వదిలి తమతమ భార్యలతో వేరు వేరుగా వెళ్ళిపోయారు. రాజయ్య కుల వృత్తిలో కొన్నాళ్ళు తల్లిని భార్యను పోషించినా, చివరకు బ్రతుకుతెరువుకోసం టౌనుకు చేరుకున్నాడు.

అవమానం అని చూడకుండా కష్టపడి కూలి పనులకు వెళ్ళి కుటుంబాన్ని పోషించడం ప్రారంభించాడు. రాజయ్య, కొన్నాళ్ళకు ఒక చిన్న ఉద్యోగం సంపాదించుచున్నాడు. డబ్బును జాగ్రత్తగా ఖర్చు పెడ్తూ, అందులోనే కొంత పొదుపుచేస్తూ, ఒక చిన్న దుకాణం తెరిచాడు. భార్య కూడా అతని కష్టంలో పాలు పంచుకుంటూ, చిన్న చిన్న పనులు చేసుకుంటూ దుకాణం చూసుకొనేది. రాజయ్య తన పిల్లల్ని బళ్ళో వేశాడు. తల్లితండ్రి కష్టాన్ని అర్థం చేసుకున్న పిల్లలు బుద్ధిగా చదువుకునేవారు. రాజయ్య తండ్రి పిల్లల్ని అల్లారు ముద్దుగా చూసుకోవడమే కాదు, తన తండ్రిలేని లోటు తెలియకండా తన అక్క చెల్లెళ్ళను కూడా పిలిచి బట్టలు పెట్టడం వంటిది, చేసేవాడు. భార్య అతనికి అన్ని విధాలుగా సహకరించేది.

రాజయ్య ఉద్యోగంలో ఉండగానే పిల్లలు చదువులు పూర్తి అయ్యాయి. అందరికీ పెళ్ళిళ్ళు చేశాడు. పెళ్ళయ్యాక కూడా అతని పిల్లలందరూ ఐకమత్యంగా

ఉండేవారు. రిటైర్ట్ అయిన తండ్రిని ప్రేమగా చూసుకునేవారు. కొన్నాళ్ళకు రాజయ్య మరణించాడు. అతని భార్యను కుమారులు తమ దగ్గరే ఉంచుకొని ఆమె పోషణ భారాన్ని స్వీకరించాడు.

రాజయ్య తండ్రి కష్టపడటంలోని అందం తెలియకుండా, ఇల్లరికం వెళ్ళి జీవితంలో సుఖపడదామనుకున్నాడు. కాని బ్రతికినంత కాలం దైన్యంగా, హీనస్థితిలో బ్రతికాడు. రాజయ్య మాత్రం జీవితంలో వచ్చే ఆటుపోట్లకు భయపడకుండా, ధైర్యంగా నిలిచి, కష్టాన్ని మూలధనంగా చేసుకొని తన జీవితాన్ని, తన సంతానం జీవితాన్ని అందంగా మలుచుకున్నాడు. కష్టాలు విజయ సోపానాలన్న సత్యాన్ని తన పిల్లలకు వారసత్వంగా ఇచ్చాడు.

మేధావి

ఏ. ఉమాదేవి, ద్వితీయ బి.కాం.(సి.ఏ)

హాయ్ ఫ్రెండ్స్!

మేధావి అనగానే ఎంతో తెలివైనవాడని అనుకుంటున్నారా తెలివైనవాడే కాని కొన్నిసార్లు అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు ఎంతో తెలివైనవారికి కూడా ఏవో కొన్ని చాదస్తాలు కాని దురలవాట్లుకాని ఉంటాయి. అలాంటి ఓ మేధావి కథ ఇది. ఇది చదివాక కూడా మీరతణ్ణి తెలివైనవాడంటే, మేధావి అంటే, మీరు నిజంగా మేధావులే.

మన మేధావి గారి పేరు కిట్టు, ఈయన గురించి రాయుడానికి భూలోకమంత పేపరుగాని, సముద్రం మంత సిరా గాని సరిపోవుమరి. కాబట్టి అంత కాదు గాని, కిట్టు జీవితంలోని చిన్న సంఘటనను చూద్దాం! ఒకసారి కిట్టు ఉద్యోగానికి అప్లై చేసాడు. కొద్ది రోజులకే ఇంటర్వ్యూకి రమ్మని లెటరు వచ్చింది. ఇంటర్వ్యూలో ఎవరు ఏ ప్రశ్నలడిగినా చేప్పే విధంగా ప్రిపేర్ అయ్యాడు. కిట్టు ఇంటర్వ్యూకి పదకొండు గంటలకయితే గంటముందే బయలుదేరాడు. త్వరగా వెళితే అక్కడే కూర్చొని కాస్త కూల్‌గా ఉండొచ్చు అనుకున్నాడు. ఇంటి నుండి అడుగు బయట పెట్టబోతుండగా పిల్లెదురొచ్చింది. అంతే దాన్ని చూసి కోపంతో," పాడు పిల్లి ఇంటర్వ్యూకి వెళ్ళబోతుంటే ఎదురొచ్చింది. ఛీ! ఛీ! ఉద్యోగం రాకపోవాలి, దీని సంగతి చెప్తా" అనుకుంటూ ఇంట్లోకెళ్ళాడు. అదేంటి ఇంట్లోకెళ్ళాడు మరి ఇంటర్వ్యూకి వెళ్ళడా అని అనుకుంటున్నారా వెళతాడు. టైం ఉంది కదా......కాస్త ఆగి వెళ్ళాలని లోపలికెళ్ళాడు. అప్పుడే కిట్టు వాళ్ళ అమ్మగారు గదిలో నుండి బయటికి వస్తూనే కిట్టును చూసి ఏంట్రా నువ్వింకా ఇంటర్వ్యూకి వెళ్ళలేదా! అని అడిగింది.

వెళ్దామనే బయలుదేరానమ్మ కాని గడప దగ్గర పిల్లి ఎదురైదమ్మా! అందుకే కాస్త ఆగి వెళ్దామని వచ్చాను. అరెరె.......ఎందుకైనా మంచిది మంచి నీళ్ళు తాగి కాసేపు కూర్చుని వెళ్ళు అంది అమ్మ.

గదిలో చదువుకుంటున్న చిట్టి (శ్రీదేవి) కిట్టుకి చెల్లి. బయటికి వచ్చి చెప్పమ్మా ఇంకా ఇలాంటి విషయాలన్నీ చెప్పి అన్నయ్యని నీ చాదస్తాలకు

వారసునిగా తయారు చేసుకో. ఏంటన్నయ్యా అమ్మంటే చదువుకోలేదు కాబట్టి అలా మాట్లాడుతుంది. నువ్వు కూడా ఏంటి ఇలా? అంది. "చిట్టీ! చిన్న పిల్లవి నీకెందుకివన్నీ వెళ్ళి చదవుకో" అంటూ ఇక వెళ్ళాలని కిట్టు బైక్ తీశాడు. కాని పాపం ఇంటర్వ్యూ ఆనందంలో బైక్‌కి పెట్రోల్ కొట్టించడం మరచిపోయాడు. అయినా పర్వాలేదు ఆటోలో వెళ్తాననుకొని రోడ్డుదాకా నడిచి వెళ్ళి దూరంగా వెళ్తున్న ఆటోని కేకవేశాడు.

ఇంతలో వేరే ఆటో ఒకటి కిట్టు ముందుకు దూసుకు వచ్చింది. ఆటోలకు కరువు లేద కదా! ఎందుకంటే 10వ తరగతి గాని, ఇంటర్ తప్పిన అబ్బాయిలు కొందరు ఆటో కొనుక్కొని రోడ్డు కెక్కుతారు మరీ. సరేలెండి. వచ్చిన ఆటోలోకి ఎక్కాలని కాలు పెట్టాడు, కిట్టు ఇంతలో మొదటి ఆటో రాకెట్ వేగంతో వచ్చి కిట్టుని బయటికి లాగి, "అదేంటిసార్ నన్ను పిలిచి వేరే ఆటో ఎక్కుతారు" అంటూ లాక్కెళ్ళబోయాడు. ఇంతలో ముందొచ్చినా ఆటో వాలా ఏంటయ్యా నా ఆటో ఎక్కబోతున్న వాన్ని లాకెళ్ళుతున్నావు సార్ ముందు పిలిచింది నన్ను. కాని ముందొచ్చింది నేను. అయితే ఏంటి పిలిచింది నన్ను కాబట్టి నా ఆటో ఎక్కాలి అంటు గొడవ పడ్డారు. 'అబ్బా ఎవరో ఒకరు రండి నాకు టైమవుతుంది'.

ఉండండి సార్ మా విషయం తేలినివ్వండి. అంటూ ఇద్దరు ఇద్దరు తాగవు పడ్డారు. ఇలా వాళ్ళురారు కిట్టుని వెళ్ళనివ్వరు. వాళ్ళ నుండి తప్పించుకోవడానికి పక్కగా వెళ్తున్న రన్నింగ్ బస్ ఎక్కాడు కిట్టు.

హమ్మయ్య బయటపడ్డాడులే అనుకుంటున్నారా? కాని పాపం మన కిట్టు బస్ ఎక్కిన కాసేపటికి దొంగ, దొంగ ....నా నెక్లెస్ పోయింది అంటూ అరిచిందొకావిడ. అంతే వెంటనే డోర్ క్లోజ్ చేసి పోలీస్ స్టేషన్‌కి పోనిమ్మన్నాడు కండక్టర్ బస్సును. ఆ మాటకు అవాక్కయ్యాడు కిట్టు. పోలిసులు బస్‌లో అందరిని చెక్ చేస్తున్నారు. కిట్టు వంతు వంచ్చేసరికి పాపం 20 ని॥లు పట్టింది. టైం 10:35 అవుతుంది. పోలీసు స్టేషన్ నుంచి గబ గబ బయటికి వచ్చాడు కిట్టు. ఆటోని పిలవబోయి ఎందుకొచ్చిన తంటా అనుకొని టాక్సీని పిలిచాడు. టాక్సీ బయలుదేరింది, కాని రాజకీయ నాయకుల రోడ్ షో కారణంగా మరికొంత ఆలస్యమయ్యింది. చివరికి ఉరుకులు పరుగులతో ఆలస్యంగా ఇంటర్వ్యూ జరుగుతున్న స్థలానికి చేరుకొనే సరికి అతని వంతు వచ్చింది. ఆయాసంతో రొప్పుతూ లోపలికి వెళ్ళాడు. ఇంటర్వ్యూలో సరిగ్గా జవాబులు చెప్పలేదు.

దానితో కిట్టుకి ఉద్యోగం రాలేదు. ఆ దిగులుతో ఇంటికి వస్తుంటే చిన్న యాక్సిడెంట్ జరిగింది. మోకాలికి చిన్న దెబ్బతగిలి హస్పిటల్‌లో ఉన్నాడు. మరి హాస్పిటల్‌లో ఉంటే పరామర్శకు బంధువులు వస్తారు కదా, వచ్చినవాళ్ళు యాక్సిడెంట్ ఎలా జరిగింది. అడుగుతారు అవునా! అసలయితే మన కిట్టుగారు ఏం చెప్పాలి?

"చేపా! చేపా ఎందుకెండలేదు?" అన్న కథలా చదువుకుందాం, సరేనా!

"కిట్టు, కిట్టూ యాక్సిడెంట్ ఎలా జరిగింది?

"ఉద్యోగం రాలేదని దిగులుగా వస్తుంటే సైకిల్ గుద్ది వెళ్ళిపోయింది. సైకిలేంటి అనుకుంటున్నారా చెప్పానుగా చిన్న యాక్సిడెంటని. సరే.

కిట్టూ, కిట్టూ ఉద్యోగం ఎందుకు రాలేదు?" "నేను జవాబు చెప్పలేదు".

"కిట్టూ, కిట్టూ జవాబు ఎందుకు చెప్పలేదు?

"నాకు ఆయాసమోచ్చింది".

"కిట్టూ, కిట్టూ అంతగా ఎందుకు అయాసమోచ్చింది"?

"ఆలస్యం అయిందని పరుగెత్తుకుంటూ వెళ్ళాను".

"కిట్టూ, కిట్టూ ఎందుకు ఆలస్యమయ్యింది"?

"రాజకీయ నాయకుల రోడ్ షో నేను ఎక్కిన టాక్సీకి అడ్డు వచ్చింది".

"అసలు టాక్సీ ఎందుకు ఎక్కావు?"

"బస్సు పోలిస్ స్టేషన్‌లో ఆగింది".

"బస్ ఎందుకెక్కావ్?"

"ఆటో వాడి గొడవ పూర్తవడం లేదని".

"నువ్వు ఆసలు ఆటో ఎందుకు పిలిచావు?" "నా బైక్‌లో పెట్రోల్ లేదు కాబట్టి".

"కిట్టూ, కిట్టూ పెట్రోల్ ఎందుకు కొట్టించలేదు?"

"ఈ ప్రశ్నకు నేను మర్చిపోయానని కదా కిట్టు చెప్పాలి. మరి మన

కిట్టు తెలివి చూడండి. బంధువులు వచ్చి అడిగితే, "పాడుపిల్లి ఇంటి నుండి బయలుదేరుతుండగా ఎదురుపడింది. అందుకే నా కాలికి దెబ్బతగిలింది" అన్నాడు. చూశారా? పిల్లి ఎదురైతేనే కదా మంచి నీళ్ళు తాగి 10 ని॥ల ఆగి మరీ బయలుదేరాడు. అలా కాకుండా ఈ శకునాలను లేక్కచేయకుండా బయలుదేరి వుంటే త్వరగా చేరుకునే వాడు కదా. తప్పనిసరి కాని ఒప్పుకుంటున్నాడా! లేదు. నేరమంతా పిల్లి మీద మోపుతున్నాడు ఇలాంటి వాళ్ళు చాలా మంది ఉన్నారు. ఉదాహరణకి ఒక రచయిత చాదస్తం గురించి అంటే చాదస్తాలను నమ్మవద్దని ఒక గొప్ప పుస్తకం రాసారు. ఆ పుస్తకం పబ్లిష్ చేయించాలనుకొని బయలుదేరుతుండగా ఎవరో తుమ్మారంటే అంతే, శకునం బాగాలేదని మరో రోజుకి ఆయన కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నాడట.

ఇప్పటికైనా తెలుసుకోండి శకునాల్లో లేదు మనకు లభించే ఫలితం. మనం చేసే పనిలో, ఆ కష్టంలో ఉంటుంది, నిజమైన ఫలితం. శకునాలు నిజమైతే మంచి శకునం ఎదురుపడే దాకా ప్రతి ఒక్కరు తమ పనులను అరంభించకుండా ఉండవల్సిందే. మంచి పనికి అడ్డంకులులేవు.

ఇది చదివి ఏ ఒక్కరైనా తమ మూఢనమ్మకాన్ని మార్చుకుంటే ఈ నా చిన్న ప్రయత్నానికి కొండంత ఫలితం దక్కినట్లే.

లీకైన ప్రశ్నా పత్రాలు

కె. సంధ్యారాణి, ప్రథమ బి.ఏ

కాలేజీ నుండి అప్పుడే ఇంటికి వచ్చాను. రోజులాగే అమ్మ ముభావంగా ఏదోపని చేసుకుంటూ ఉంది. "అమ్మా ఏం చేస్తున్నావ్" అంటూ అమ్మ దగ్గరికి వెళ్ళాను. మా అమ్మ బట్టలు సర్దుతూ, కన్పించింది. నేను "ఎందుకమ్మా! బట్టలు సర్దుతున్నావు?" అన్నాను. "మీ తాతగారికి బాగాలేదని టెలిగ్రామ్ వచ్చింది. అందువల్ల మనమందరం తాతగారి ఊరికి బయలుదేరుతున్నాం మీనాన్న గారు రైల్వే స్టేషన్‌కి రిజర్వేషన్ కోసం వెళ్ళారు" అంది అమ్మ ! "అయితే ఇప్పుడే బయలుదేరాలా" నిరాశగా అడిగాను. నేనడిగినదానికి జవాబు చెప్పకుండా, "సరేగాని నీబట్టలు, అన్నయ్య బట్టలు సర్దాను. ఇంకా ఏమైనా కావాలంటే సర్దుకో" అంది అమ్మ.

"అమ్మా ! ప్లీజ్, నేను ఊరికి రావడం లేదు. ఎందుకంటే ఈ వారంలోనే మాకు పరీక్షలున్నాయి" దిగులుగా అన్నాను. "అదేంటే అట్లా అంటున్నావు మీతాతగారు నీ పేరే కలవరిస్తున్నారట! పైగా నువ్వు మీ తాత గారి ముద్దుల మనవరాలివి కదా! నువ్వు రాలేదంటే మీ తాతయ్య బాధపడతాడు" అంది. అమ్మా "ప్లీజ్ నేను రానమ్మా! కావాలంటే పరీక్షలు అయిపోయాక నేను ఒక రోజు నాన్నగారితో వెళ్ళి చూసివస్తాను" అని అన్నాను. కాని అమ్మ ఒప్పుకోలేదు. "కావాలంటే నన్నొక్కదాన్ని ఇంట్లో వదిలి పొమ్మన్నాను" కాని అమ్మ ఒప్పుకోలేదు పైగా "అదేంటే అట్లా అంటున్నావు ? మొన్నోరోజు మన కాలనీలో దొంగలు పడ్డ విషయం నీకు తెలుసుగా. అందుకే మిమ్మల్ని ఇంట్లో ఒంటరిగా ఉంచను....... అసలు విషయం అర్థం చేసుకోవేంటి నువ్వు రావలసిందే" అంది అమ్మ.

మా అమ్మ అలా అనేసరికి, చిన్నప్పుడు మా తాతయ్యతో ఉన్న అనుబంధం గుర్తుకు వచ్చింది. చిన్నప్పుడు నాకు ఏది కావాలంటే అది తీసుకుని వచ్చేవాడు. నన్ను ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. నేను వాళ్ళ అమ్మలాగా ఉంటాను అని అంటూ ఉండేవాడు అది గుర్తుకు వచ్చి నేను కూడా బయలుదేరాను. అక్కడ మూడురోజులు ఉండి, మా తాత గారు కొంచెం

కోలుకున్నాక ఇంటికి వచ్చాము! రాత్రి 7 గంటల సమయంలో నా ఫ్రెండ్ నాకు ఫోన్ చేసింది. "ఏమే సంధ్యా బావున్నావానే ! మీ తాత గారి ఒంట్లో ఎలా ఉంది ?" అని అడిగింది. "ఫరవాలేదు బాగానే ఉన్నాడు" అన్నాను. "అది సరే గాని రేపటి నుండి మనకు పరీక్షలే" అని చెప్పింది. దానితో నాకు చాలా భయం వేసింది. ఆ భయం కాస్త అమ్మ మీద కోపంగా మారింది. నేను టెన్షన్ పడుతుంటే అమ్మ చూసింది. "అదేంటే అలా ఉన్నావు? అని అడిగింది అమ్మ. "ఆ....! మరి ఇలా ఉండక ఎలా ఉంటాను రేపు మాకు పరీక్షలు" అంటూ "అంతా నీవల్లనే" అంటూ పుస్తకాలు చేతపట్టుకొని కోపంగా వెళ్ళి చదువుకుంటూ కూర్చున్నాను. వస్తున్న ఆవలింతల్ని ఆపుకుంటూ!

"సంధ్యా! సంధ్యా!" ఎవరో పిలుస్తున్నారు. ఎవరదీ? వస్తున్న నిద్రనాపుకుంటూ తలెత్తిచూశాను. నా ఎదురుగా ఒకాయన నిలబడి ఉన్నాడు. "ఎవరూ! మీరెవరూ?" భయంగా అడిగాను. అతని చేతిలో ఒక కవర్ లాంటిది కనిపించింది. మళ్ళీ ఒకసారి "ఎవరండీ మీరూ?" అని అడిగాను. "అదేంటి అలా అంటున్నావు? నీవేకదా ఈ రోజు అంతా పిలిచావు" అని అన్నాడు. అర్థం కాక అతన్ని అలా చూస్తున్నాను. నా దృష్టి ఆయన చేతిలో నున్న కవర్‌పై పడింది. "అదేమిటి" అని అడిగాను నీ కోసమే అని అన్నాడు."నా కోసమా! ఏమై వుండవచ్చు ? బట్టలా, పుస్తకాలా నగలా ? ఆలోచిస్తున్నాను" నా కుతూహలాన్ని గమనించి అతను ఆ కవర్‌ను నా చేతికిస్తూ "భయపడకు ఇవి నీ ప్రశ్నా పత్రాలు. అయితే నీవు ఇప్పుడే కవర్ చింపి చూస్తే అందులోని అక్షరాలు నీకు కనిపించవు. అవి జనవరిలోనే తెరచి చూడాలి. అప్పుడే ఆ ప్రశ్నలు నీకు కన్పిస్తాయి. అన్నట్లు మీ ఇంట్లో వాళ్ళకు కూడా కనిపించకుండా దాచిపెట్టు" అని అన్నాడు. ఒక్కసారిగా నాకు సంతోషంతో నోటమాట రాలేదు. నా దిగులంతా మరచిపోయి, ఆ కవర్‌ను ఎక్కడ పెట్టాలి అని ఆలోచించడం మొదలుపెట్టాను. మొదట నా బ్యాగ్‌లో పెడదామని అనుకున్నాను.కాని మా అన్నయ్య వాటిని చూస్తే నన్ను అనుమానిస్తాడు పోనీ అలమారాలో పెడదామా! అని అనుకుంటే అమ్మ ఇల్లు సర్దేటప్పుడు వాటిని 'బయట పారేయడమో, లేదా పేపరు వాడికి గాని వేసేస్తుందేమో' అని భయంవేసింది. ఆఖరికి నేను వాటిని మా నాన్న గారి ఆఫీసు ఫైల్స్ పెట్టే అలమారులోని పేపరు క్రింద దాచి పెట్టాను "హమ్మయ్య!" అని అనుకున్నాను.

"సంధ్యా! సంధ్యా! ఈ రోజు కాలేజీ లేదా?" అమ్మ గొంతు వినిపించింది. గబగబా లేచి నాన్న ఆఫీసు ఫైల్ ఉన్న అలమారు దగ్గరకు వెళ్ళాను, కవర్ తీసుకుందామని. కాని పెట్టిన చోట కవర్ లేదు. మళ్ళీ కంగారుగా వెతికాను మా అమ్మ చూసి ఏంటే ఏమిటో వెదుకుతున్నావు? అని అడిగింది. "ఆ, ఏమీ లేదులే" అని అన్నాను. "అమ్మా! నేను రాత్రి ఇక్కడ ఒక కవరు పెట్టాను. నీవు తీసావా ?" అని అడిగాను. "అదేంటే ! నాకు ఏమీ పని లేదు అని అనుకుంటున్నావా! అవును గాని నీవేంటి సర్దుతున్నావు ? అందరికంటే ముందు తయారయి, ఐదు నిమిషాలు ముందుగా కాలేజీకి వెళ్ళేదానివి ఇంకా సర్దుతున్నావు" అని అడిగింది అమ్మ.

"అమ్మా ! నేను రాత్రి కవరులో కొన్ని పేపర్లు పెట్టి ఇక్కడ పెట్టాను, అవి కనిపించడం లేదమ్మా. అందుకే ఎక్కడ పెట్టానా? అని ఆలోచిస్తున్నాను" అని అన్నాను. "ఓ... అదేంటే ?నీకు ఏమైనా కలగాని వచ్చిందా!" సందేహంగా అడిగింది అమ్మ.

"లేదమ్మా నాకు దేవుడు కనిపించి ఇవే చదువుకో అంటూ ప్రశ్నా పత్రాల కవర్ ఇచ్చారు. అవి ఇక్కడే పెట్టాను. వాటి కోసం వెదుకుతుంటే, నువ్వు కలా? అంటావు" అన్నాను. అది విన్న అమ్మ గట్టిగా నవ్వుతూ,

"నువ్వు రాత్రి అంతా పరీక్ష గురించి ఆలోచించావుకదా! అందుకే అలా కల వచ్చింది" అంది అమ్మ.

'ఓ! అయితే ఇదంతా కలా?' అనుకుంటూ కాలేజీకి బయలుదేరాను. ఈ విషయం విని స్నేహితురాళ్ళు కడుపుబ్బ నవ్వారు.

కాలం విలువ

జి. ఏంజిల్, ద్వితీయ బి.ఏ.

డియర్ లతా !

గతించిపోయిన కాలం ఒక హిస్టరీ. ముందు నిలిచివున్న కాలం ఒక మిస్టరీ కాలం కంటే విలువైనది. యీ లోకంలో మరొకటి లేదు. డబ్బు పోతే దాన్ని తిరిగి సంపాదించవచ్చు. గతించి పోయిన కాలాన్ని తిరిగి రాబట్టడం ఎవరితరము కాదు. డబ్బుతో గడియారాన్ని కొనవచ్చు కానీ కాలాన్ని కొనలేము. దేవుడు మనిషికి ఇచ్చిన వరాలన్నింటిలో అతి గొప్ప వరం 'కాలమే' దేవుడు మనకిచ్చిన ఉచిత వరం తన మహిమ కొరకు జీవించేలా దేవుడు మనకిచ్చిన వరం ఈ కాలం.

"గడిచిపోయినట్టి క్షణము తిరిగి రాదు.

కాలమూరకెపుడు గడుపబోకు

దీప మున్నయపుడే దిద్దుకోవలెనిల్లు

విలువ తెలిసి చదువు తెలుగుబిడ్డా"

కాలానికి, మనిషి జీవితానికి మధ్య విడదీయరాని సంబంధం వుంది. కాలం ఎంత వేగంగా పెరుగుతుందో మనం కూడా అదే వేగంతో పరుగెత్తాలి. కాలం కంటే ముందు పరుగెత్తలేం. కాలం కంటే నెమ్మదిగాను పోలేం. కాలంతోపాటే మనమూ, మనతోపాటే కాలము."సమయమును పోనియ్యక సద్వినియోగము చేసుకొనుచూ ఉండవలెను" 365 రోజులు × 24 గంటలు, అంటే 8760 గంటలు. ఇందులో పదోవంతు 876 గంటలు రమ్మని ఎన్ని కేకలు వేసినా కాలం వినిపించుకోదు. కాలానికి కరుణలేదు. తిరిగి రమ్మంటే రాదు. ఒక వ్యక్తి 58 సం॥లు జీవిస్తే అందులో నిద్రకు 23 సం॥లు, ఉద్యోగానికి 20 సం॥లు, బాతాకాని(అనవసరమైన మాటలకు)కి 9 సం॥లు. భోజనంకు, నిత్యకృత్యాలకు $5\frac{1}{2}$ సం॥లు దేవుని సన్నిధిలో జీవించునది 6 నెలలు. కాలానికి పక్షపాతం లేదు. కాలం దృష్టిలో అందరూ సమానులే. ఈ లోకం పోకడలను, మనిషి స్థితిగతులను కాలం ఏ మాత్రం పట్టించుకోదు. మనమే కాలాన్ని

పట్టించుకోవాలి. దేశాన్ని పరిపాలించే మహారాజుకు 24 గంటలే. రోజు గడవని నిరుపేద కూలీకి రోజుకు 24 గంటలే. శ్రమించే శాస్త్రవేత్తకు గంటకు 60 నిమిషాలే. సర్వసంగపరిత్యాగి అయిన సన్యాసికి గంటకు 60 నిమిషాలే. కాలానికి పక్షపాతం లేదు. కాలం దృష్టిలో అందరూ సమానులే "ఆ అజ్ఞాన కాలంలో చూచి చూడనట్లుగా ఉన్నవాడు ఇప్పుడు పట్టి పట్టి చూస్తున్నాడు" కాలాన్ని వ్యర్థపుచ్చే యుగంలో మనమున్నాం తీరుబడిలేని కాలంలో మనం జీవిస్తున్నాం. చిత్రం ఏమిటంటే ఎంత కష్టించి పనిచేసినా ఏమిసాధించలేకపోయిన్నాం. అర్థం లేని వ్యర్థప్రయత్నాలతోఎక్కువ సమయాన్ని పాడుచేస్తున్నాం అనిపిస్తుంది. ఈ సంవత్సరంలోనైనా నా జీవితంలో ఒక నూతన క్రియ జరిగితే బాగుండును అని ఆశించాలి. దేవుడు మనకు ఇచ్చింది ఒకే ఒక్క జీవితం, ఆ జీవితం కాస్తా త్వరలో అయిపోతుంది. దేవుడు మనకు నిర్ణయించిన ఆయుష్ 'కాలం' కాస్తా ముగుస్తుంది. దేవుడిచ్చిన కాలాన్ని ఎలా ఖర్చుపెడుతున్నాం అనేది అత్యంత ప్రాముఖ్యమైన విషయం. ఎందుచేతనంటే ఈ జీవితం అయిపోయిన తర్వాత నీవు నేనూ చేయగలిగింది అంటూ ఏమి లేదు. సమయం గతించిపోతుంది. సంవత్సరాలు మనమీదుగా దొర్లుతున్నాయి.

"రాబోయే సంవత్సరాలలో భగవంతుని ఆశీస్సులతో జీవి ద్దాం"

"కాలమూ, కెరటమూ ఎవరికోసం ఆగవు !"

లతా ! ఏమిటీ ఉత్తరం ? అక్కయిలా వ్రాసింది, అనుకుంటున్నావా ? మొన్న ఆదివారం అమ్మా నాన్న, నిన్ను చూసివచ్చిన తర్వాత నీ గురించి చాలా బెంగపెట్టుకున్నారు. నాన్న ఎంత కష్టపడి నిన్ను చదివిస్తున్నారో నీకు తెలుసు. చదువుకోవాలని నేను చాలా ఆశపడ్డాను. కాని, నాకు చెప్పేవారు లేక, ఉన్నా వినేమనసు నాకు లేక, చదువుకోవాలన్న నా కోరిక గగన కుసుమయింది. నీ చదువు అలా కాకూడదు. కాలం విలువ నాకు తెలిసినంతగా, చిన్నదానివి, నీకు తెలిసివుండదు. అందుకే యీ ఉత్తరం. ప్లీజ్! నువ్వైనా చదువు పూర్తిచేయి. జారిపోయిన కాలం తిరిగి రాదని గుర్తించు. నీ ఆరోగ్యం జాగ్రత్త! ఉంటాను, ప్రేమతో.........

అక్క
సుధ

ఉత్తరం పూర్తయ్యే సరికి నా కళ్ళు నీళ్ళతో నిండాయి. మనసును ఎవరో పీకేస్తున్నట్లు అనిపించింది. నిజమే! చదువు పూర్తి కానందుకు అక్కయ్య పడే బాధ నాకింకా గుర్తుంది.

కళ్ళు తుడుచుకున్నాను. ఒక దృఢనిశ్చయానికి వచ్చినట్లు లేచి, నా అల్మారాలోనుంచి పుస్తకాలు తీసుకొని స్టడీహాల్ వైపు నడిచాను.

"లతా! లతా ! ఉండవే అంత్యాక్షరీ ఆడుకుందాం! అని వెనుక నుండి వస్తున్న నా రూమ్మేట్ల పిలుపులు ఈ రోజు నన్ను ఆపలేకపోయాయి. అప్పుడే కాదు! ఇంకెప్పుడూ నేను ఏ ప్రలోభాలకూ లొంగను. ఇలా అనుకోగానే నాలో ఆత్మవిశ్వాసం కలిగింది. రేపే థాంక్స్ చెప్తూ అక్కకు ఉత్తరం రాయాలి" అనుకుంటూ స్టడీ హాల్లోకి అడుగుపెట్టాను.

సాయిబు తాత

జి. హేమ, ప్రథమ బి.ఎ.

రామయ్య, సీతమ్మ అనే దంపతులకు "లక్ష్మి" అనే 7 సం॥ల వయస్సుగల పాప వుండేది. వారు రైతు కూలీలు. రోజూ కూలీ సొమ్ము వస్తేకాని వారికి పూట గడవదు. కాని ఆ పాపకి చదువు అంటే చాలా ఇష్టం. చదువుకోవాలని చాలా ఆశ వుండేది. తినటానికే తిండి లేని వారు పాపని ఎలా చదవిస్తారు? పైగా సీతమ్మ అవిటిది. రామయ్యకు ఆస్తి లేక పోయినా కులం పిచ్చి బాగా వుండేది. తన కులం వారితో తప్ప హిందువులతో తప్ప మరొకరితో మాట్లాడేవాడు కాదు. కనీసం పాపని వేరే కులం పిల్లలతో ఆడుకోవటానికి కూడా పంపేవాడుకాదు.

ఒక రోజు లక్ష్మి చెట్టు కింద గుడి దగ్గర కూర్చొని ఏడుస్తుంది. అదే ఊరిలో వుంటున్న "సాయిబ్ తాత" అటు వైపు వెళుతూ లక్ష్మిని చూశాడు. "ఏమైంది? ఎందుకు ఏడుస్తున్నావు పాప" అని అడిగాడు. దానికి పాప "నాకు చదువు అంటే చాలా ఇష్టం. నాకు చదువుకోవాలని వుంది. కాని మా నాన్న కూలీ డబ్బు తెస్తేగాని మాకు తిండి ఉండదు. అలాంటిది నన్ను ఎలా చదివిస్తారు". అని అడిగింది. దానికి తాత గవర్నమెంట్ స్కూల్లో చేరమన్నాడు. దానికి పాప, "తాతా నాకు తెలియదు. మా నాన్నకి చెపితే నన్ను కొడతాడు, కాబట్టి నువ్వే చేర్పించు" అని అంది. తాత పాపను స్కూల్లో చేర్పించాడు. ఈ విషయం రామయ్యకు తెలియదు. కాని తాతయ్య చాల మంచివాడు. అతనిని అందరూ "సాయిబ్ తాత" అని పిలిచేవాళ్ళు. తాతకు ఎవరూ లేరు. కాని కొంచెం ఆస్తి వుంది. దానిని అపదలో వున్న వారికి ఖర్చు పెట్టేవాడు.

లక్ష్మి తండ్రికి తెలియకుండా, తండ్రి పనికి వెళ్ళగానే పాఠశాలకు వెళ్ళేది. ఇలా కొన్ని రోజులు జరగగా ఒక రోజు అలసటగా వుండటం వల్ల పని మధ్యలో రామయ్య ఇంటికి వచ్చాడు. ఇంట్లో లక్ష్మి లేదు. కంగారుపడుతూ ఊరంతా వెతికాడు కాన్ని లక్ష్మి లేదు. నిరాశతో ఇంటికి చేరారు. సాయంకాలానికి లక్ష్మి పాఠశాల నుండి ఇంటికి వచ్చింది "ఎక్కడికి వెళ్ళావు?" అని అడిగితే లక్ష్మి సమాధానం చెప్పటం లేదు. గట్టిగా అరిస్తే అప్పుడు చెప్పింది. సాయిబ్ తాత విషయం అంతా చెప్పింది. దానికి రామయ్య లక్ష్మిని బాగా తన్నాడు. "కులంకాని వాడితో ఎందుకు మాట్లాడావు?" అని తన్నాడు.

రెండు మూడు రోజుల నుండి లక్ష్మి పాఠశాలకు వెళ్ళటం లేదు అని తాతకు తెలిసింది. ఏమైందో అని తాత రామయ్య ఇంటికి వచ్చాడు. కాని రామయ్య తాతను అవమానించి వృద్ధుడు అని కూడా చూడకుండా తోసేశాడు. తాత కొనిచ్చిన పుస్తకాలు, సంచి పలక మొదలైన వస్తువుల్ని తాత ముఖాన కొట్టాడు. రామయ్యకు తెలియకుండా లక్ష్మి తాత దగ్గరకు వెళ్ళిది.

ఒక రోజు రామయ్య పనిలో ఆలస్యం అయింది, ఇంటికి రావటానికి ఉన్న దారిలో వస్తుంటే చీకటిలో రామయ్యని ఒక కారు వాడు గుద్ది వెళ్ళాడు. ఆ డ్రైవరు మద్యం సేవించి వుండటం వలన రామయ్యను గుద్ది వెళ్ళిపోతాడు. ఇంట్లో లక్ష్మి సీతమ్మ కంగారుపడతాడు.

పని మీద పట్నం వెళ్ళి వుంటాడు అనుకొని ఆ రాత్రి గడిచిపోతుంది. కాని రామయ్యకు కారు గుద్దిన విషయం తెలుసుకున్న తాతయ్య రామయ్యను ఆసుపత్రిలో చేర్చి విషయం లక్ష్మి వాళ్ళకు చెప్పుతాడు. కానిన రామయ్య తలకు పెద్దగాయం అవటం వలన ఆపరేషన్ జరిపించాలని వైద్యులు చెపుతారు. దానికి డబ్బు చాలా అవసరం అవుతుంది రామయ్యకు పెద్దలు సంపాదించిన ఏ ఆస్తీ లేదు. ఆప్రిషన్‌కి డబ్బులు ఎలా అని లక్ష్మి, సీతమ్మ ఏడుస్తుంటే సాయిబ్‌తాత తన ఇంటిని తాకట్టు పెట్టి కావలసిన మొత్తాన్ని ఏర్పాటు చేశాడు. కొన్నాళ్ళకి రామయ్య ఆరోగ్యం కుదుటపడుతుంది. మళ్ళీ పనికి వెళ్ళేఓపిక కూడా వస్తుంది. దీనికి కారణం సాయిబ్ తాత చేసిన సాయం రామయ్య తను చేసిన తప్పును తెలుసుకొని తాతను క్షమాపణలు కోరతాడు అందరితో కలివిడిగా వుండటం నేర్చుకుంటాడు. లక్ష్మిని కూడా మరల పాఠశాలలో చేర్పించి చాల కష్టపడి తను తిన్నా తినకపోయినా లక్ష్మిని చదివిస్తున్నాడు. తాత ఇంటి పత్రాలు తాకట్టు నుండి విడిపించి తాతకు అప్ప చెప్పాడు. తాత కూడా రామయ్యను క్షమిస్తాడు. దీని వలన మనకు తెలిసింది ఏమిటంటే మతం, కులం అంటూ దగ్గరయిన మంచి మనుషులను దూరం చేసుకోవద్దు. ఆ మూర్ఖత్వంలో పెద్దల మీద చెయ్యి ఎత్తి కొట్ట కూడదు. మతం కంటె మానవత్వం గొప్పదని గుర్తించాలి.

ఓ అమ్మాయి కథ

పి.జ్యోతి, ప్రథమ బి.జడ్.సి.

పల్లెటూర్లో నివసిస్తున్న ఒక పేద కుటుంబం తమ జీవనాన్ని గడపడం కోసం పట్టణానికి వలస వెళ్ళారు. ఆ కుటుంబంలో భార్య, భర్త ముగ్గురు పిల్లలు మొత్తం ఐదుగురు ఉన్నారు. ఆ భార్యా భర్తలు మున్సిపాలిటిలో రోడ్డు ఊడిచే పని చేస్తూ ఉండే వారు. ఆ పని చేస్తూ ఇద్దరు ఆడపిల్లల్ని గవర్నమెంటు పాఠశాలలో ఒక అబ్బాయిని ప్రైవేట్ పాఠశాలలో చేర్పించి చదువు చెప్పిస్తున్నారు. తాము చదువుకోకపోయినా, తమ పిల్లలు చదువుకొని ప్రయోజకులు కావాలనీ వాళ్ళు కష్టపడి పిల్లల్ని చదివిస్తున్నారు. వారి పెద్ద అమ్మాయి ఎనిమిదివ తరగతి చదువుతుండగా వాళ్ళ నాన్న చనిపోయారు. ఆ దిగులుతో వాళ్ళ అమ్మ కూడా క్రమంగా ఆరోగ్యం క్షీణించటం వల్ల మరణించింది. అనాథలైన ఆ పిల్లల్ని ఎవరూ ఆదుకోలేదు. ఎనిమిదవ తరగతి చదువుతున్న పెద్ద అమ్మాయికి వాళ్ళ నాన్న చేసే ఉద్యోగం యిచ్చారు. దిక్కుతోచని పరిస్థితులలో ఆమె ఆ ఉద్యోగమే చేస్తూ ఒకరి మీద ఆధారపడకుండా తను కష్టపడి, తన తమ్ముడిని, చెల్లిని చదివిస్తూ, ఖాళీ సమయంలో ఒక షాప్‌లో పని చేస్తూ వారికి అండగా వుంటూ ఎటువంటి కష్టం రాకుండా తనే అమ్మ నాన్నగా వాళ్ళను చూసుకుంది.

తల్లిదండ్రులు ఆశించినట్లు చెల్లెల్ని తమ్ముడిని ఉన్నత చదువులు చదవించాలని ఆమె కోరిక వాళ్ళిద్దరూ కూడా అక్క తమ కోసం చేసిన త్యాగాన్ని గుర్తించి చదువే ధ్యేయంగా, తమ జీవితాలను మలుచుకుంటూ ఎన్నో చదువులు చదివారు. పోటీ పరీక్షలు వ్రాసి ఇద్దరూ మంచి ఉద్యోగాలు సంపాదించారు. నడి సముద్రంలో మునిగివున్న తమ జీవన నౌకల్ని, ధైర్యంగా నిలిచి, ఒడ్డుకు చేర్చిన అక్క పట్ల ప్రేమతో ఆనందంగా బ్రతికారు.

పితృూణం

జి. త్రివేణి, ప్రథమ ఎమ్.బి.సి.

ప్రకృతి రమణీయతకు ఆలవాలమైనది కోనసీమ, అరటి, కొబ్బరి, చెఱకు తోటలు భూదేవికి పచ్చని పట్టుచీరెను కట్టినట్లు కనుచూపు మేర కన్పడే వరిపొలాలు. నిరంతరం ప్రవహించే పంట కాలువలపై నుండి వచ్చే మలయ మారుతము చూపరుల హృదయాలను ఆనందడోలికలలో ఉయ్యాలలూగిస్తుంటాయి. ఇటు ప్రకృతి రమణీయత కనువిందు చేస్తుంటే పవిత్ర దేవాలయాల నుండి వినిపించే వేద ఘోష వీనుల విందు చేస్తాయి.

అటువంటి కోనసీమ ప్రాంతంలోనిదే "ముని పల్లె" గ్రామం. ఆ గ్రామంలో నివసించే వారిలో బ్రాహ్మణ కుటుంబాలే అధికం. వివిధ కుల వృత్తుల వారు కూడా ఆ గ్రామంలో నివసించుట చేత అది పరిపూర్ణ గ్రామమని చెప్పాలి. ప్రాత: కాల సమయంలో, వేద పండితులు తమ శిష్యులకు వేద పన్నాలను వల్లె వేయిస్తుంటే ప్రతి ఒక్కరిలో పవిత్ర భావాలు ప్రేరేపితమౌతాయనుటలో సందేహం లేదు.

ఆ గ్రామంలో పరమేశ్వర శాస్త్రి పదవీ విరమణ పొందిన ప్రభుత్వోపాధ్యాయుడు. సహజంగానే వారసత్వంగా వచ్చిన స్థిరాస్తి, స్వగృహము, ప్రభుత్వము వారిచ్చే పెన్షన్ అతనికి జీవన భృతి.

ఆ ఇంటి ఇల్లాలే అన్నపూర్ణ. పేరుకు తగ్గట్టుగానే అతిథి మర్యాదలకు లోటురానివ్వకుండా కుటుంబ గౌరవాన్ని నిలుపుకుంటూ తన కుటుంబమునకే కాక పొరుగు వారికి కూడా అవసరమైన సేవలందించుటలో గృహిణి అనే పదాన్ని అర్ధవంతం చేస్తుండేది.

పరమేశ్వర శాస్త్రికి పుత్ర సంతానం లేదు "అపుత్రస్యగతిర్నాస్తి" అనే ఆర్యోక్తిని తలుచుకుంటూ తన ఇరువురు కుమార్తెలనే పుత్రులుగా భావించి తీర్చిదిద్దాడు.

పెద్ద కుమార్తె శ్వేతాంబరి, చిన్న కుమార్తె నీలాంబరి. యుక్త వయస్సులోనే తమ ప్రవర్తనతో గ్రామంలో అందరి చేత మెప్పు పొందేవారు.

శాస్త్రిగారు తన పెద్ద కుమార్తెను పుత్రుడుగా భావించి శ్వేతా! ఒరే, అని

సంబోధించే వారు. చిన్న కుమార్తెచే శ్వేతను "అక్కా" అనుటకు బదులు "అన్నా" అని పిలిపించేవారు. ఎవరైనా శ్వేతను స్త్రీగా సంబోధిస్తే అలా పిలవకండి! శ్వేత నా పుత్రుడు. నన్ను పున్నామ నరకము నుండి తప్పించేవాడు వాడే అని వినయంగా అనేవారు.

పరమేశ్వర శాస్త్రి గారి అరువది రెండవ ఏట ఆయన సహధర్మచారిణి అన్నపూర్ణ దివంగుతురాలైంది. వారి కుటుంబమంతా శోక సముద్రంలో మునిగి పోయింది. శ్వేత, నీల ఇరువురూ తమ తండ్రి దు:ఖములో పాలుపంచుకొంటూ ఆయనను సముదాయించే వారు. వారి మేనమామ కృష్ణ శాస్త్రి సలహా సంప్రదింపులతో తల్లి అంత్యక్రియలను ఘనంగా జరిపించాడు.

అన్నపూర్ణ మరణంతో శాస్త్రి గారి ఆరోగ్యం క్షీణించడం ప్రారంభమయింది. నెల తిరగక ముందే పరమేశ్వర శాస్త్రి గారు తన బిడ్డలను ఏకాకులను చేసి దివంగుతురాలైనారు. మేనమామతో సహా బంధువులందరూ వచ్చి అక్క చెల్లెళ్లను ఓదార్చుటకు ప్రయత్నించారు. కాని శ్వేత, నీలల దు:ఖానికి అడ్డుకట్ట వేయ లేక పోయారు.

శాస్త్రి గారి మంచి తనమునకు నిదర్శనంగా గ్రామంలోని అన్ని కుటుంబాల వారు ఇంటి ముందు గుమిగూడారు.

ఇక్కడే ప్రారంభమైంది అసలు సమస్య.

శాస్త్రి గారికి పురుష సంతానం లేదు. వారి అంత్యక్రియలను ఎవరు చేయాలి అనేది ప్రధాన సమస్య.

దగ్గర బంధువైన మేనమామ తన తల్లిదండ్రులు సజీవులగుటచేత చితికి నిప్పుపెట్టే అర్హత తనకు లేదన్నారు.

దహన సంస్కారం చేయటానికి ఏ ఒక్కరు ముందుకు రాలేదు.

దు:ఖసాగరంలో మునిగియున్న శ్వేతకు విషయం అర్థంచేసుకుంది. దు:ఖాన్ని దిగమ్రింగి తన తండ్రి అంత్యక్రియల ఏర్పాటుకోసం ఇంటిముందర గుమిగూడియున్న బంధువులు, స్నేహితుల మధ్యకు వచ్చి నిల్చుంది.

పరమేశ్వర శాస్త్రిగారి ఆప్త మిత్రుడైన రామేశ్వర శ్రాస్త్రి గారు, శ్వేతను దగ్గరగా పిలిచి సమస్యను వివరించాడు.

కొంతసేపు దీర్ఘంగా ఆలోచించిన శ్వేత "మానాన్న గారు నన్ను పుత్రుడుగా భావించి పెంచారు. నన్నెల్లప్పుడూ ఒరే అని పిలిచేవారు. ఇపుడు నేనే నా తండ్రికి పుత్రుడను. అంత్యక్రియలు, దహన సంస్కారము నేనే చేస్తాను" అని అంది.

అందుకు రామేశ్వర శాస్త్రి గారు, అమ్మా! అది శాస్త్ర విరుద్ధమమ్మా స్త్రీలను అంత్యక్రియలు, అగ్నిసంస్కారం చేసే అర్హత లేదమ్మా! అన్నారు.

"క్షమించండి శాస్త్రి గారు, నేను తమతో వాదనకు ప్రయత్నిస్తున్నానని భావించకండి. అత్యవసర సమయములలో స్త్రీలు కూడా పురుషులతో సమానంగా, కర్తవ్యములను నిర్వర్తించుటకు అర్హత ఎందుకు ఉండకూడదు" స్థిరంగా ప్రశ్నించింది శ్వేత.

నిజమేనమ్మా! కాని, శుభకార్యములందు వలె అశుభకార్యములయందు స్త్రీలు పాలుపంచుకొనుటకు అర్హత లేదమ్మా!

ఐతే నా తండ్రి పార్థివ శరీరానికి అంత్యక్రియలు నిర్వర్తించేదెలా? శాస్త్రిగారు!

"అమ్మా! కర్తవ్యం నీపై ఉంచి ఎవరైనా ముందుకు వస్తే వారితో చేయించవచ్చు".

"అందుకు ఎవరైనా ముందుకు వస్తారేమో విచారించండి శాస్త్రి గారూ!" అని అంది శ్వేత.

రామేశ్వర శాస్త్రి గారు తదితర బ్రాహ్మణ కుటుంబముల వారితో చర్చించి ఫలితము లేనందున శ్వేత వద్దకు వచ్చి.

"అమ్మా శ్వేతా! ఇందరిలో ఎవ్వరూ దహన సంస్కార క్రియను చేయటానికి ముందుకు రావటం లేదమ్మా" అన్నారు. కొంచెం బిడియంగా!

"ఐతే శాస్త్రి గారూ! నా నిర్ణయం వినండి! ఇది ధర్మమేకాని, అధరమ్మేకానీ నాకు జన్మనిచ్చిన నా తండ్రి పార్థివ శరీరాన్ని కుక్కల, నక్కల, గ్రద్దలపాలు చేయను. చేయలేను, వివాహ మంత్రాలలో "అష్టవర్షాత్కన్యా పుత్రవత్ పాలితామయా" అని వధువును వరునకు అప్పగింతలు చేసే సమయంలో వధువు తండ్రి అప్పగిస్తాడు. 'పుత్రుని వలె ఈ కన్యను పెంచాను' అని అంటారు. మరి నేను కూడా నా తండ్రి చేత పుత్రుని గానే పెంచబడ్డాను. కావున నా తండ్రి

పార్థివ శరీరానికి నేనే దహన సంస్కారం చేస్తాను. ఇక ఆలోచించక తగిన ఏర్పాట్లు చేయించండి. ధనలోపము లేదు. కర్మ అంతా సమశాస్త్రీయంగా నిర్వర్తింపచేయండి. ధృఢంగా చెప్పింది శ్వేత.

"శ్వేతా! తప్పని స్థితిలో నీకు దహన సంస్కారమునకు మాత్రమే కాని మిగిలిన క్రియలకు నీకు ఎట్టి పరిస్థితులలోనూ అర్హత లేదమ్మా" అన్నారు రామేశ్వర శాస్త్రిగారు.

"సరే తర్వాత విషయం ఆలోచిద్దాం! ముందర ఈ కార్యక్రమము పూర్తికానివ్వండి" అంది శ్వేత. బంధువుల, మిత్రుల, శ్రేయోభిలాషుల సమక్షంలో శ్వేత, నీల ఇరువురూ తండ్రి చితికి నిప్పంటించారు. ఆనాటి కార్యక్రమం పూర్తి అయింది.మూడవ రోజు జరగాల్సిన కార్యక్రమాన్ని కూడా శ్వేత స్వయంగా నిర్వర్తించి, త్రివేణీ సంగమంలో నిమజ్జనం చేయడానికి అస్థికలు సేకరించి మృణ్మయ పాత్రలో భద్రపరిచింది. ఆ సాయంకాలమే శ్వేత రామేశ్వర శాస్రిగారికి కబురు పంపి పిలిపించుకుంది. మేనమామ కనీస బాధ్యతను గుర్తించకుండా భార్యా బిడ్డలతో తిరిగి వెళ్ళారు. ప్రస్తుతం శ్వేత, నీల మాత్రమే మిగిలారు. ఇరుగు పొరుగు వారు అప్పుడప్పుడూ వచ్చి సముదాయించి వేళ్లేవారు. శ్వేత పిలుపు నందుకున్న రామేశ్వరశాస్త్రి గారు శ్వేత వద్దకు వచ్చారు.

"నా తండ్రి గారి అస్థికలను త్రివేణి సంగమంలో నిమజ్జనం చేసి గయలో తీర్థవిధిని నిర్వర్తించి పిండప్రధానము చేయదలచుకొన్నాను. ఈ కార్యక్రమమంతా పన్నెండవ రోజు లోపల పూర్తి చేయాలనుకొంటున్నాను. మా కుటుంబ శ్రేయోభిలాషిగా నాకు తగిన సూచనలివ్వమని కోరుతున్నాను." వినయంగానే అడిగింది శ్వేత.

"అమ్మా శ్వేతా! మీ నాన్న గారి శాస్త్ర పరిజ్ఞానాన్ని నీవు కూడా అవగాహన చేసికొన్నావు! ధర్మశాస్త్ర ప్రకారం నీవు ఇప్పటి వరకు నీవు నిర్వర్తించిన కర్మసమ్మతము కాదు, నీకు పిండప్రధానం చేసే అర్హత ఉండదమ్మా!" అన్నారు శాస్త్రిగారు.

"అర్హత అనర్హతను గురించి నేను తమతో చర్చించగల సమర్ధురాలను కాదు. ప్రస్తుతం నాముందున్నది కర్తవ్యనిర్వహణా సంకల్పము. ఈ నా సంకల్పమునకు తిరుగు లేదు. గయలోని పండితులను మెప్పించి నా కర్తవ్యమును నిర్వర్తిస్తాను. నా తల్లిదండ్రుల ఋణం తీర్చుకుంటాను" అన్న శ్వేతతో సరేనమ్మా!

నీ ఇష్టప్రకారమే కానిమ్ము! ప్రస్తుతం నేను చేయవలసినది ఏమైనా ఉందా? ప్రశ్నించారు శాస్త్రిగారు.

"అందుకే గదా శాస్రి గారూ మిమ్మల్ని రమ్మన్నది! మా నాన్న గారి బ్యాంకు ఖాతాలో రెండు లక్షల నిల్వ ఉంది. ఇంటిలో కొంత ధాన్యం కూడా ఉంది. కొబ్బరితోటలో కాయ దింపుడుకు వచ్చింది. అరటి గెలలు కోతకు రావచ్చు. మేము తిరిగి వచ్చేంత వరకు మా వ్యవహారములను నిర్వర్తించ వలసినదిగా కోరుతున్నాను" అంటూ కోరింది శ్వేత.

"అమ్మా శ్వేతా? ఇంతటి బరువు బాద్యతలను నాపై మోపుటకంటే మీ మేనమామ గారిని పిలిపించి ఆయనకో ఆయన కుమారునకో ఈ బాధ్యతల అప్పగించుట నీకు మేలమ్మా! ఎంతైనా వారు మీ ఆత్మ బంధువులు కదా!" బిడియంతో అన్నారు శాస్త్రిగారు.

"ఆత్మబంధువులు అనిపించుకునే అర్హత వారికి లేదు శాస్త్రి గారు. తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు ఆడపిల్లలపై కనీస సానుభూతి కూడా లేకుండా మూడవ రోజున వెళ్లి పోయారంటే వారికి మాపై ఉన్న ప్రేమానురాగాలు తెలియటం లేదా శాస్త్రిగారూ?! ఆవేదనగా అన్న శ్వేతతో శాస్త్రిగారిలా అన్నారు.

నేను ఈ బాధ్యతలను తీసుకుంటే వారు ఈర్ష్యపడతారేమో!"

"వారి ఈర్ష్యా ద్వేషాలతో నాకు సంబంధం లేదు శాస్త్రి గారు. నా తండ్రి గారి సంపదకు వారసులము నేను, నీల మాత్రమే! నేను కాశీ నుండి తిరిగి వచ్చిన తరువాత వారసత్వ ధృవపత్రాలను తీసికొని నా ఆస్తిని సంరక్షించుకుటాను."

అమ్మా శ్వేతా! నీ ఆత్మ స్థైర్యం ముందు నేనేమి మాట్లా లేక పోతున్నాను. ఇంకేమైన చెప్పవలసినది ఉందా!"

"మరొక విషయం శాస్త్రి గారూ! మేము యాత్రలకు వెళ్ళి తిరిగి వచ్చుటకు కార్యక్రమములు నిర్వర్తించుటకు కొంత పైకము అవసరముంది. నేను తిరిగి వచ్చిన వెంటనే బ్యాంకు నుండి తీసి మీకు ఇస్తాను. అంత వరకు మీరు సర్దుబాటు చేయండి."

"అట్లాగే! ఎంతకావాలమ్మా."

"50,000 రూపాయలు అవసరముంటాయి. దాని ధర్మాలు చేయాలి కదా నా తండ్రి శ్రాద్ధకర్మలను సక్రమంగా సశాస్త్రీయంగా నిర్వహిస్తాను."

"మీ ప్రయాణం ఎప్పుడమ్మా."

"ఈ రోజే తమరు నరసాపురం వెళ్ళి మా ఇరువురికి అలహాబాద్ వరకు రైలు టిక్కెట్లు రిజర్వు చేసికొని రండి. రేపు ఉదయం మేము ప్రయాణమౌతాము" అంది శ్వేత.

సరే! అట్లాగేనమ్మా! నేను వెళ్ళి వస్తా! రేపు ఉదయానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తా, అంటూ వెళ్ళారు శాస్త్రిగారు.

ఐదవ రోజు ఉదయానికి శ్వేత, నీల ఇరువురూ అలహాబాదు చేరారు. తమ తలిదండ్రుల అస్థికల మృణ్మయపాత్రలను తీసికొని త్రివేణి సంగమ ఘాట్‌కు చేరుకున్నారు. అచ్చటి పురోహితులను అస్థి నిమజ్జన కార్యక్రమం చేయంచవలసినదిగా కోరారు. పురోహితులు అందరూ సమావేశమైనారు. స్త్రీలకు అస్థినిమజ్జనం చేసే అర్హత లేదు. ఈ కార్యక్రమం మేము చేయించమనీ, ఇది శాస్త్ర విరుద్ధము అని నిరాకరించారు. వారితో వాదించుటకు ఇష్టములేని శ్వేత, నీల ఇరువురూ త్రివేణి సంగమంలో స్నానం చేశారు. అస్థికలను తీసికొని పడవలలో సంగమం వరకు చేరుకొన్నారు. తలిదండ్రులను మనస్సులో ధ్యానిస్తూ అస్థికలను త్రివేణీ సంగమంలో ఆత్మసంకల్పయుక్తముగా నిమజ్జనము చేసారు. అచ్చట గల పురోహితులందరికి తమ తలిదండ్రుల పేరు మీద దానాలిచ్చారు.

వారిద్దరు వెంటనే గయకు ప్రయాణమైనారు. ఆరవ రోజు ఉదయానికి గయకు చేరుకున్నారు. విచారించగా వారికి ఆంధ్రాశ్రమము, అచట ఉండే హరిజగన్నాథశాస్త్రి గారి వివరములు తెలిశాయి. ఆంధ్రాశ్రమునకు చేరి నిత్యకృత్యములను పూర్తి చేసికొని శాస్త్రిగారి రాక కొరకు ఎదురు చూచారు. కొంతసేపటికి శాస్త్రిగారు రావటంతోటే వారిని కలిసికొని తమ వివరములు తెల్పారు.

శాస్త్రిగారు వారిని కొంతసేపు వేచి ఉండమని తాను కూడా ఆంధ్ర ప్రాంతము వాడినేనని మీకు అన్ని విధాలా సంహకరిస్తానని వారికి మాట ఇచ్చారు. పదకొండు గంటల సమయంలో శాస్త్రిగారు శ్వేత, నీలల గది వద్దకు వచ్చారు. విషయం అంతము సవివరముగా చెప్పిన శ్వేత , తన తండ్రికి

పుత్రసంతానము లేనందున తామే పిండప్రధానము చేయ సంకల్పించామని 12వ రోజు వరకు తాము అక్కడే ఉంటామనీ, సపిండీకరణ కార్యక్రమము శాస్త్రోక్తముగా జరిపించవలసినదని తెల్పారు.

శాస్త్రిగారు కొంత ఆలోచించి, పిండప్రధానము చేయుటకు స్త్రీలు అర్హులు కారని అధిధర్మశాస్త్ర సమ్మతము కాదన్నారు. అయినను సాయంకాలము పురోహితుల సమావేశము ఏర్పాటు చేసి చర్చిస్తానని తెల్పారు.

సాయంకాలము నాలుగు గంటలకు శాస్త్రిగారితో పాటు పదిమంది పురోహితులు సమావేశమైనారు. వారిలో గుంటూరు, కృష్ణ మరియు తూర్పు గోదావరిజిల్లాల పండితులు కూడా ఉన్నారు. చర్చ ప్రారంభినస్తా జగన్నాధశాస్త్రిగారు పురోహితులకు విషయం అంతా కూడా వివరించారు.

వారందరూ ఏకగ్రీవముగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన గోపాలకృష్ణశాస్త్రిగార్కి రిర్ణయాధికారాన్ని కట్టబెట్టారు.

గోపా :- అమ్మా శ్వేతా! తల్లిదండ్రులను పున్నామ నరకం నుండి తప్పించుటకు కేవలము పుత్రునికి మాత్రమే అర్హత యున్నదని ధర్మశాస్త్రం చెబుతుంది.

శ్వేత :- ఐతే పుత్రసంతానము లేని వారు పున్నామ నరకము అనుభవించాల్సిందేనా శాస్త్రిగారూ.

గోపా :- అమ్మా! నీ సందేహము సమంజసమైనదే! కాని శాస్త్ర నియమములను అధిగమించలేము కదా!

శ్వేత :- అయ్యా! నాదొక మనవి ! స్త్రీలకు మాతాపితల ఋణము తీర్చుకొను అర్హత లేదంటారా!

గోపా :- లేదనే శాస్త్రం చెపుతుంది.

శ్వేత :- శాస్త్రం స్త్రీ, పురుషుల ఇద్దరకు సమాన భాధ్యతలు ఉంటాయని చెపుతున్నది కదా!

గోపా :- కొన్ని విషయాలలోనే

శ్వేత :- శ్రీ మహావిష్ణువు లక్ష్మీదేవిని తన వక్షస్థలంలో నిలుపుకున్నాడు. కాదా ? లక్ష్మీదేవి ఎట్లా అర్హురాలైంది. పరమశివుడు ఏకంగా పార్వతికి

అర్ధశరీరమిచ్చి గంగను శిరస్సు పై ధరించాడు కదా, వారు స్త్రీలే కదా వారికా అర్హత ఎక్కడిది?

గోపా :- అమ్మా! వారు దేవతలు, మనము మానవులం ? వారి అర్హతలను ప్రశ్నించే అధికారము మనకు లేదు.

శ్వేత :- అయితే శివకేశవులే వారికి ఆ హక్కును కల్పించారంటాను కాదంటారా!

గోపా:- కావచ్చు.

శ్వేత :- శ్రీ రాముడు విషయంలో త్రేతాయుగంలో మానవుడి అవతారమెత్తాడు అనుట నిజం కాదా!

గోపా :- కావచ్చు.

శ్రేత :- శ్రీరాముడు అశ్వమేధయాగం చేయుసమయమున వనములో నున్న సీతకు బదులుగా కనక సీతను ప్రక్కన ఎందుకుంచుకున్నాడు.

గోపా :- యాగం సంపూర్ణం కావాలంటే శ్రీరామునికి సీత చేతిమీదుగా ఆహుతులు అందింపబడాలి. క్షీరతర్పణమునకు శ్రీరాముని చేతిలో అక్షంతలపై సీతాదేవి క్షీరాన్ని ధారపోయాలి. అందుకే కనక సీతను ప్రక్కన ఉంచుకున్నాడు.

శ్వేత :- సత్యవంతుని ప్రాణాలను తీసుకొని పోతున్న యమధర్మరాజును నిలువరించి తన భర్తను తిరిగి పొందిన సావిత్రి దేవికి ఏవిధమైన హక్కు ఉంది.

గోపా :- అది హక్కు కాదు ? బాధ్యత.

శ్వేత :- వివహసమయంలో కన్యాధానం చేసేటపుడు వరుని కాళ్ళు కడగటానికి పెండ్లి కుమార్తె తల్లియే. నీళ్ళుపోవాలి.

గోపా :- ఆవిధంగా చేయటం కన్న తల్లిగా ఆమెకున్న హక్కు! బాధ్యత.

శ్వేత :- ఈ స్త్రీలు కూడా పురుషులతో సమానంగా పూజింపబడవలెనని శాస్త్రం చెప్పలేదా!

గోపా :- అవును.

శ్వేత :- దంపతులను గురించి చెప్పేటప్పుడు సీతారాములు, పార్వతీ పరమేశ్వరులు, రాధాకృష్ణులు, లక్ష్మీనారాయణులు అని ముందుగా స్త్రీల పేర్లే

చెపుతారు. కాని స్త్రీలకు ఆ హక్కులేనపుడు రామసీత, పరమేశ్వర పార్వతి, కృష్ణరాధా, నారాయణలక్ష్మి అని ఎందుకు చెప్పకూడదు?

గోపా :- అమ్మా శ్వేతా! నీవు ఇచ్చిన ప్రతి ఉదాహరణలలో పురుషులతో పాటు స్త్రీలు కూడా సమానమైన హక్కులు బాధ్యతలు కలవారని నిరూపించుటప్రశంసనీయమే.

శ్వేత :- అయినపుడు నా తల్లిదండ్రుల ఋణము తీర్చుకొనుటకు నాకు పిండ ప్రధానం చేయు అర్హత లేదని మీరు ఏ ధర్మశాస్త్రమునననుసరించి నిరూపిస్తారు.

గోపా :- ధర్మశాస్త్రాన్ని ప్రశ్నిచే అధికారము మనకు లేదుకదమ్మా !

శ్వేత :- శాస్త్రిగారూ! ఇది కలియుగము. ఆధునిక యుగము, న్యాయశాస్త్రం స్త్రీలు కూడా పురుషులతో సమానంగా హక్కులు, బాధ్యతలు కలిగి ఉంటారని ఘోషిస్తున్నాయి. కావున నా యందు దయయుంచి నా తల్లిదండ్రులకు సంపీడకరంణ కార్యక్రమము మా ఇరువురిచే సశాస్త్రీయంగా నిర్వహింపచేయండి. మా తల్లిదండ్రులకు మోక్షాన్ని ప్రసాదించండి. మీరందరు భూసురులు బ్రాహ్మణులే కలియుగ మందు ప్రత్యక్ష దైవాలు, మీ ద్వారానే మానవులకు దైవదర్శనం లభిస్తుంది. దైవానుగ్రహం కలుగుతుంది. ఇంతసేపు మీ అమూల్యకాలాన్ని హరించి వాదించినందుకు మన్నించండి.

గోపా :- అమ్మా! నీ వాదనను, అభిప్రాయములను విన్న తర్వాత మాలో కూడా కొంత సంచలనం కల్గింది. నా సహపురోహితుల అంగీకారముతో 9వ రోజునుండి ప్రారంభించి దశాహ, షోడశ సంపీండీకరణ కార్యక్రమములను నిర్వర్తించి మీ తల్లిదండ్రులకు మోక్షప్రాప్తి, పున్నామ నరకము నుండి విముక్తి కల్గు అవకాశం కల్పస్తామని వాగ్దానము చేస్తున్నాను.

శ్రీయూతులు హరజగన్నాథ శర్మగారి ద్వారా కర్యక్రమములకు తగిన ఏర్పాట్లు చేసుకొనండి.

తర్వాత శ్వేత, నీలలచేత పిండం పెట్టించారు. పురోహితులు వారిని హృదయపూర్వకంగా ఆశీర్వదించారు.

ఆదర్శ మహిళ

బి. విజయ కుమారి, ప్రథమ బి.ఏ

ఉదయపురం రాజుకు కొత్తగా పెళ్ళైంది. పెళ్ళైన ఆరు నెలలకు ఆ దంపతుల మధ్య ఒక చిన్న గొడవ జరిగింది. గొడవ పెరిగి, పెరిగి వాళ్ళు కొన్నాళ్ళకు విడిపోయారు. విడపోయేముందు రాజుతో రాణి ఒక సవాలు చేస్తుంది. "బండ మీద రాజనాలు పండిన్నాడు, ఏడు అంతస్థుల మేడ కట్టి, ఏడుగురు జీతగాళ్ళు, ఆరుగురు దాసీలను పెట్టుకుంటాను" అని చెప్పి వెళుతుంది.

అలా వెళ్ళి వెళ్ళి శక్తిపురం శివారు చేరుకుంటుంది. అక్కడ మగ వేషం, అంటే రాజు వేషం ధరించి పోడు కొట్టిస్తుంది. డుగురు జీతగాళ్ళతో అరక కట్టిస్తుంది. కొన్నాళ్ళకు ఏడు అంతస్తుల మేడ కడుతుంది. ఆరుగురు దాసీలను పనిలో పెట్టుకొని అక్కడే ఉండిపోతుంది. ఆమె మగ వేషంలోనే ఉండిపోయింది.

ఉదయపురంలో ఆమెభర్త, అంటే రాజు దిగులుతో పిచ్చివాడిలా ప్రవర్తిస్తూ ఉంటాడు. రాజ్యాన్ని కోల్పోతాడు. 'అన్నం పెట్టండి, బట్టలు ఉంటే ఇవ్వండి' అని అక్కడక్కడా తిరుగుతూ శక్తిపురం శివారు చేరుకుంటాడు రాజు. అక్కడి వాళ్ళు రాజు దీన స్థితిని చూసి, 'ఇక్కడ లేవు కాని ఈ ఊళ్ళో ఒక రాజు ఉన్నాడు అక్కడికి వెళ్ళండి. వాళ్ళైతే ఇవ్వవచ్చు' అని చెప్తారు. 'సరే' అని రాజు ఆ ఊరికి వెళతాడు. అక్కడికి వెళ్ళి కొంచెం అన్న పెట్టండి, పాత బట్టలు ఉంటే ఇవ్వండి అని అడుగుతాడు. ఆ రాజు భార్య, అంటే మగవేషంలో ఉన్న స్త్రీ అతనని గుర్తు పడుతుంది. కాని ఆ రాజు తన భార్యను గుర్తు పట్టడు. అక్కడ పనిచేసే జీతగాడితో ఆ రాజు, వచ్చిన అతనిని పనికి పెట్టుకోమని అడుగుతాడు. ఆ జీతగాడు, 'మా రాజుగారిని అడగాలి' అని అంటాడు. అడిగిన తర్వాత, 'రాజు ఒప్పుకున్నాడు' అని అంటాడు. ఆ ఇంట్లో పనిచేసే దాసితో, "వచ్చిన వ్యక్తికి అన్నంపెట్టు", అని చెప్పి గుర్రం మీద పొలానికి వెళుతుంది, రాజు వేషంలో ఉన్న ఆరాణి. రాజు కష్టపడి పనిచేస్తుంటాడు.

ఆ రాజు వచ్చిన కొన్నాళ్ళకే పంటలు పండుతాయి. బండమీద రాజనాలు పండినాయి. కాకులు, గోరింకలు, చీమలు, పిచ్చుకలు, అన్నీ ధాన్యాన్ని ఇంటికి

మోసి ఒక గదిని నింపుతాయి. ఆ తర్వాత రోజు రాణి పెళ్ళి బట్టలు కొనడానికి వెళుతుంది. రాజులందర్నీ పిలుస్తుంది. ఆమె ఆ మగ వేషం తీసేంత వరకు ఆమె స్త్రీ అని ఎవరికీ తెలియదు. అత్త మామలను, తల్లి దండ్రులను కూడా పిలిపిస్తుంది. ఆమె పెళ్ళి కుమార్తె లాగా తయారై వస్తుంది. ఆమెను గుర్తించిన రాజులో పశ్చాత్తాపం మొదలవుతుంది. రాజుకు తన భార్య వెళ్ళిపోయే ముందు చెప్పిన వన్నీ గుర్తుకొస్తాయి. మళ్ళీ వాళ్ళిద్దరు పెళ్ళి చేసుకుంటారు.

రాణి అభిమానాన్ని, ఆమె ఆదర్శ జీవితం ద్వారా తన ప్రతిజ్ఞను నిలబెట్టుకున్న విధానాన్ని, చూచిన రాజు తన ఓటమికి సిగ్గుపడి ఆమెను మనస్ఫూర్తిగా అభినందించాడు.

అంతరంగం

కె. హైమావతి, ద్వితీయ బి.జడ్.సి.

ఆయన పేరు ఆనందం. ఆస్తి గలవాడు, ఒక్కడే కొడుకు. పేరు ప్రసాద్. వారిది సాంప్రదాయాలు 'తు.చ.' తప్పకుండా పాటించే కుటుంబం. చిన్నతనం నుండి ప్రసాద్ తండ్రి చెప్పు చేతుల్లో పెరిగాడు. కుమారుణ్ణి అన్ని విధాలా గుణ వంతుణ్ణి చేయాలని ఆనందం కోరిక. ముఖ్యంగా కుమారుడిలో ఓర్పు ఉండాలని తండ్రి ఆశ. ప్రతిదినం కుమారుడి ఓర్పు పరిక్షించాలని ఆనందం అభిమతం. అందుకు ఒక ఉపాయం కనిపెట్టాడు.

ప్రతిరోజు తాను పడుకోబోయేటప్పుడు కొడుకును పిలిచి, ఒక చెంపకాయ కొట్టేవాడు. కొడుకు చెంపదెబ్బతిని, వెళ్ళి పడుకొని హాయిగా నిద్రపోయేవాడు. ఒక్కొక్క రోజున ఆనందం రాత్రి పొద్దుపోయేదాకా కొడుకుని పిలిచే వాడు కాదు. ప్రసాద్ అప్పటిదాకా మేలుకొని కూర్చునేవాడు. ఎంత నిద్రవచ్చినా ఆపుకొనేవాడు. తండ్రి చెంపకాయ కొట్టిన తరువాత హాయిగా నిద్రపోయేవాడు.

ఇది చాలా కాలం గడిచింది. ప్రసాద్ పెద్దవాడయ్యాడు. అందగాడయ్యాడు. బలశాలి అయ్యాడు. బుద్ధిమంతుడయ్యాడు. పెళ్ళి ఈడు వచ్చింది. ఒక్క గొప్ప ఇంటి అమ్మాయిని ఇచ్చి పెళ్ళి చేశాడు తండ్రి. ఆవిడ అందగత్తె కూడా ! ప్రసాద్ తనకు తగిన వరుడని గర్వపడింది. కాపురానికి వచ్చిన తరువాత ఒకటి, రెండు రోజులకు గాని తెలియలేదు. – అతడు రోజూ తండ్రి చేత చెంపదెబ్బతింటాడని.

ప్రసాద్ రాత్రిపూట భార్యతో కలసి కబుర్లు చెప్పుకోవడం కోసం ఎంతో సంబర పడేవాడు. కాని తండ్రి ఎప్పుడు పిలుస్తాడోనని భయంతో నిశ్శబ్దంగా కూర్చునేవాడు. భార్య మాటల్లోకి దించితే 'ఇస్సు' అని ఆపేసేవాడు. ఆవిడకు కోపం వచ్చి "ఇవాళ మీ నాన్న పిలిచినా వెళ్ళవద్దు" ఇన్నేళ్ళు వచ్చి, చెంపకాయ తినడమేమిటి ?" అనేది.

అతడు "అలా అనకూడదు... తప్పు... నన్ను చెంపకాయ కొట్టకపోతే మా నాన్నకు నిద్రపట్టదు. తినకపోతే నాకు నిద్రపట్టదు. ఆ దెబ్బ తిని వచ్చిన తరువాత నాకు ఎంతో నిబ్బరం వస్తుంది. ఎంత కులాసాగానైనా నీతో మాట్లాడగలను" అనేవాడు.

ప్రసాద్ భార్య ఎంతో చెప్పింది. చెంపకాయ తినడం వల్ల పౌరుషం చచ్చిపోతుంది, అనేది. నా భర్త అలాంటివాడు కావడం నాకిష్టంలేదు అనేది. ఎన్ని చెప్పినా, ఎంత గోలపెట్టినా, ప్రసాద్ ఆవిడ మాట వినలేదు.

ఒక రోజు రాత్రి తండ్రి పిలిచాడు. ప్రసాద్ వెళ్ళి చెంప అందించాడు. తండ్రి మామూలుగా కొట్టాడు. వెంటనే ప్రసాద్ బావురుమన్నాడు. "నాన్నా! నాన్నా! అని కౌగిలించుకొని, దుఃఖించడం ప్రారంభించాడు. తండ్రి ఎంతో బాధపడుతూ "ఏమిటిరా ? ఏమిటి ? ఎందుకు ఏడుస్తున్నావు? దెబ్బగట్టిగా తగిలిందా ? నొప్పి పుట్టిందా ?" అన్నాడు.

"లేదు నాన్నా ! ఇవాళ మామూలుగా దెబ్బతగల్లేదు. నీ చేతిలో బలం తగ్గిపోయింది. ముసలితనం బాగా వచ్చింది. అనుకుంటే ఏడుపు వచ్చింది. నాన్నా నువ్వు చాలా కాలం బ్రతకాలి" అన్నాడు. తండ్రి అతనిలో గల పితృభక్తికి చాలా ఆనందపడ్డాడు. కుమారునిలో ఓర్పుకు సంతోషించాడు. తన కొడుకు కూడా తండ్రి కాగలుగుతున్నాడని భావించి ఇక తాను పట్టించుకోనవసరం లేదని భావించి కొడుకుయొక్క పెద్దరికాన్ని నిలబెట్టాలనుకున్నాడు, ఎదిగే వయసులో ఉన్నతీపిగుర్తులు పెద్దయినతరువాత చేదుమచ్చలు కాకూడదనీ భావించాడు.

అమ్మ మనస్సు

బి. సంధ్యారాణి, ప్రథమ ఎమ్.ఇ.సి.ఎస్

అమ్మా! నేను నీ గర్భాన ప్రాణం పోసుకున్నప్పుడు నువ్వు ఎంతో సంతోషించావు. ఆ సంతోషాన్ని ప్రేమగా మార్చుకొని నీ గర్భంలోని నన్ను నీ కంటికి రెప్పలా కాపాడావు. నీకు ఏబాధ కలిగించకుండా నేను బయటికి రావాలి. అని కోరుకున్నావు. కాని నీకు బాధ కలిగించి నేను బయటికి వచ్చాను. నీ రక్తాన్ని పాల రూపంలో స్వీకరిస్తుంటే ఎంతో సంతోషించావు. నేను పెరిగేకొద్దీ నువ్వు ఎంతో మురిసిపోయావు. నా పాదాలు కందుతాయేమోనని నన్ను నీ గుండెలపై నడిపించావు. నేను ఎవరిపై ఆధారపడకూడదని, నేను గొప్ప స్థాయికి ఎదగాలి అని నువ్వు ఎంతో కష్టపడ్డావు. నేను ఏభయంకర దృశ్యాన్ని చూసినా భయపడకూడదని నాకు చాలా ధైర్యం చెప్పావు. నేను కష్టపడితే నా చేతులు కందుతాయని అన్నీ నువ్వే చేశావు. నాకు ఎన్నో సందర్భాలలో స్నేహితురాలిగా నిలిచావు. నా కష్టాన్ని నీ కష్టంగా భావించావు. అన్నిటా నాకు ప్రాధాన్యాన్నిచ్చి నీ ప్రతిబింబంగా నన్ను నిలిపావు.

ఇలా మమతానురాగాలను పంచి నా హృదయంలో మాతృమూర్తిగా ఉన్నత స్థానంలో నిలిచావు. అమ్మా నీ ఋణం ఎలా తీర్చుకోను, నీ వృద్ధాప్యంలో నీకు తల్లినైతే తప్ప !

చిన్న అనుభవం

కె. సంధ్యారాణి, ద్వితీయ బి.కాం.సి.ఏ

మా కుటుంబం పెద్దది. మా తాతయ్య వాళ్ళతో కలసి వేసవి సెలవులలో వేములవాడ వెళ్ళాము. మా ప్రయాణం చాలా సరదాగా జరిగింది. అక్కడికి వెళ్ళిన తర్వాత దేవుని దర్శనం కోసం చాలాసేపు అక్కడే ఉన్నాము. సుమారు మూడు గంటల తర్వాత నెమ్మదిగా తోసుకుంటూ గుడి లోపలికి వెళ్ళాము. అక్కడ పోలీసులు అందరిని ఆపుతూ నెమ్మదిగా పంపిస్తున్నారు. అందుకే మాకు ఆలస్యం అవుతుంది అనుకున్నాను. అప్పుడు నేను మూడో తరగతి చదువుతున్నాను. నాకు వాళ్ళు ఎందుకు అలా పంపిస్తున్నారో అర్థం కాలేదు. అందరినీ ఒకేసారి పంపిస్తే తొందరగా దర్శనం అవుతుందికదా! అనుకున్నాను. మేము వెళ్ళేటప్పటికి అతను మమ్మల్ని కూడా అక్కడే వెళ్ళనివ్వకుండా ఆపాడు. మా నాన్న గారు అతనితో గొడవ పెట్టుకున్నాడు. అయినా అతను మమ్మల్ని పంపించలేదు. నాకు చాలా కోపం వచ్చింది. అయితే నేను చిన్నదాన్ని కాబట్టి ఏమీ చేయలేకపోయాను. మేము చాలా సేపు అక్కడే ఉన్నాము.

ఆ తరువాత అతనే మమ్మల్ని పంపించాడు. దర్శనం బాగా జరిగింది. కాని ఆవిషయం నాకు చాలా గుర్తుండిపోయింది. అప్పటి నుండి నాకు జాతర్ల దగ్గర కాని, గుడిలో ఉన్న పోలీసులు కానీ, ఇంకా ఎవరైనా అలా ఆపి, ఆపి పంపిస్తుంటే నాకు చాలా కోపం వస్తుంది. ఎందుకో అర్థం కాదు.

నేను తొమ్మిదోతరగతి చదివేటప్పుడు స్కౌట్స్‌లో చేరాను. అయితే మా నాన్నగారు అందులో సర్వీస్ చేయడం చాలా ఇష్టం అని చెప్పారు. నేను స్వాతంత్రదినోత్సవం వంటి ఉత్సవాలలో అందరినీ వరుసగా నిలబెట్టడానికి స్కౌట్‌లో ఉండేదాన్ని.

ఒక్కొక్కసారి స్కౌట్స్‌లో సర్వీస్‌కు వెళ్ళిరావడం చాలా ఆలస్యం అయింది. ముఖ్యంగా దసరా అలాంటి వాటికి మరీ ఆలస్యమైతే మా నాన్న నాకోసం వచ్చేవారు.

మా స్కౌట్స్ అంకుల్ కూడా మమ్మల్ని జాగ్రత్తగా చూసేవారు. మాకు ఆయన స్కౌట్స్ గురించిన అన్ని విషయాలు చెప్పేవారు. స్కౌట్స్ అంటే చాలా సౌమ్యంగా ఎదుటి వారితో మాట్లాడడం, ఎదుటి వారు మమ్మల్ని కోప్పడ్డా

మనం అలా ఉండకూడదు. ఎదుటివారికి సహాయపడడం స్కౌట్స్ ముఖ్య ఉద్దేశ్యమని చెప్పారు. స్కౌట్స్ పితామహుడైన "బ్లెడన్ పవన్" గురించి చెప్పారు.

స్కౌట్స్‌లో చేరిన తర్వాత నేను ధైర్యంగా ఉండడం చాలా వరకు అలవరచుకున్నాను, ఎవరితో ఎలా మాట్లాడాలి అనేది బాగా అర్థమైంది.

ఒకసారి భద్రాచలం సీతారాముల కళ్యాణమప్పుడు నేను స్కౌట్స్ ద్వారా అక్కడికి వెళ్ళాను. స్కౌట్స్, గైడ్స్ అందరం కలిసి ప్రొద్దున్నే వెళ్ళాము తర్వాత నెమ్మదిగా జనం రావడం మొదలుపెట్టారు. కొద్దిసేపు అయిన తర్వాత చాలా మంది వచ్చారు.

అంత మంది ఎప్పుడు వచ్చారో తెలియనేలేదు. కళ్యాణం జరిగింది. మా స్కౌట్ అంకుల్, మేము కలిసి వచ్చిన జనాన్ని లైన్‌లో పంపించడం మొదలుపెట్టాము. అయితే అందులో ఒక ఆమె తిట్టిన తిట్లతో నాకు ఏడుపు వచ్చింది. అయినా ఆమెను పంపకుండా ఆపి, నెమ్మదిగా పంపించాను. అలా కాకుంటే జనంలో తొక్కిసలాట మొదలవుతుంది. ఆమెకు చాలా కష్టం అవుతుంది.

అందరినీ పంపించే వరకు సాయంత్రం నాలుగు గంటలు అయింది. ఆ తర్వాత నాకు చిన్నప్పుడు వేములవాడలో జరిగిన విషయం గుర్తుకు వచ్చింది. అప్పుడు అర్థమైంది. జనాన్నెందుకు వరుస క్రమంలోనే పంపిస్తారో అని.

ఎప్పుడైనా మనం మన స్థానంలో నుంచి మాత్రమే కాదు. ఇతరుల స్థానంలో నుంచి కూడా ఆలోచించాలని నా అనుభవం నాకు నేర్పింది.

ఓర్పు - నేర్పు

బి. పార్వతి ప్రథమ ఎమ్.పి.సి

సూర్యోదయం వేళ ఆ పల్లె ప్రజలందరూ తమ,తమ పనుల్లో నిమగ్నమయ్యారు. ఆ ఊళ్లో ఉన్న ఒక శిల్పి కూడా తన పనికై బయలు దేరాడు. ఊరిబయటకు రాగానే ఓ చెట్టు దగ్గర రెండు రాళ్ళు కనిపించాయి. ఆ రాళ్ళను చూచి తన చేతులకు పని కల్పించదలచాడు, ఆ శిల్పి ఆ అందమైన రాళ్ళకోసం వాటి వద్దకు వెళ్ళడానికి సిద్ధపడ్డాడు.

ఆ రెండు రాళ్ళలో ఒక రాయి చాలా సున్నితంగా అందంగా ఉంది. మరొకటి చాలా దృఢంగా అందవికారంగా ఉంది. అయితే ఆ అందమైన రాయి ఆ శిల్పిని చూసి తన స్నేహితురాలితో ఇలా అంది. "ఓ నేస్తమా ఆ శిల్పి మన దగ్గరికి వస్తున్నాడు ఎందుకంటే మనల్ని చెక్కడానికి వస్తునాడు" అని ఏడుస్తూ అన్నది. అప్పుడు అందవిహీనమైన ఆ రెండో రాయి "ఓ పిచ్చి దానా! నీవు చిన్ని చిన్న బాధలను తట్టుకోలేక పోతే ప్రకృతిని ఎదిరించి నీ గమ్యాన్ని ఎలా చేరుతావు? ఇలా ఐతే నీ అందమైన శరీరాన్ని అభివృద్ధి చేసుకోలేవు. ఈ చిన్ని కష్టానికి నీవు ఇలా అంటావేమి ఈ కష్టాలు మనకు చుట్టాల్లాంటివి. సుఖాలు వచ్చినప్పుడు, కష్టాలు తప్పుకొని సుఖాలకు దారి నిస్తాయి కాబట్టి నీవు ఇప్పుడు కష్టపడినా, స్థిరంగా ఉండు" అని సలహాయిచ్చింది.

అంతలోనే శిల్పి చెక్కడానికి అవసరమైన ఉలి మొదలైన పరికరాలను తీసుకొని రాళ్ళ వద్దకు వచ్చి అందమైన రాయి పై చేయి వేశాడు. దానిని చూస్తే తనకు చక్కగా చెక్కాలని గట్టిపట్టుదలతో ఉన్నాడు, అని భయపడింది ఆ అందమైన రాయి. శిల్పి ఆ రాయిని చెక్కడం మొదలు పెట్టాడు. దెబ్బ గట్టిగా పడకముందే అది చిన్న చిన్న రాళ్ళుగా విడిపోయినది. ఆ శిల్పి దానిని చూసి బాధపడి తన మనస్సులో 'ఛ! ఈ రాయిని ఎంత మంచిగా చెక్కాలని అనుకున్నాను కాని అది సరిగ్గా లేదు' అని రెండో దానిని చెక్కడం మొదలు పెట్టాడు. ఆ రాయి ఎంత అంద వికారంగా ఉందో చెక్కుతూ పోతుంటే అంత మంచిగా తయారైంది. అప్పుడు ఆ శిల్పికి దాని పై నమ్మకం పెరిగి ఉత్సాహంతో చెక్కాడు అప్పుడు ఆ రాయి ఒక అందమైన బుద్ధ విగ్రహంగా తయారు అయినది అప్పుడు ఆ శిల్పి దానిని ఇలా వర్ణించాడు "ఈ ప్రపంచంలోనే పెద్దదైన అందమైన బుద్ధ విగ్రహంలా ఉంది" అని అనుకున్నాడు. ఆ విగ్రహాన్ని తమ ఊరిలో

ఉంచగా ఆ ఊరి ప్రజలందరు ఆ శిల్పాన్ని చూసి ఆనందించారు. పనికి రాదనుకున్న కఠిన శిల, సహనం వల్ల మానవతను బోధించే బుద్ధ విగ్రహంగా మారి ఆ ఊరికి ఆనందాన్ని ప్రఖ్యాతిని ఇచ్చింది ఔన్నత్యం అబ్బుతుంది. "అవకాశం వచ్చే వరకు ఎదురు చూడు. అవకాశం వచ్చిన తరువాత జయించు" కష్టపడితే నే అని ప్రబోధించే శిల్పారామునికి మూలవిరాట్టయింది.

అపురూపమైన అనుభవం

జి. శ్రీజాదేవి, ద్వితీయ బయోటెక్.

శంకర్ భావుకుడు. అమాయకుడు, నిజాయితీ కలవాడు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టడం వలన చిన్ననాటి నుంచి కష్టాలు, బాధలు, బాధ్యతలు అన్నీ ఎరిగినవాడు. బాగా పైకి ఎదగాలనుకునేవాడు. కష్టపడి చదివి ఎలాగో బి.ఎ పాసై చిన్న ప్రైవేటు కంపెనీలో గుమస్తాగా చేరాడు. కానీ అతనిని కూడా విధి వెక్కిరించింది. మధ్యతరగతి ప్రజల జీవిత పోరాటంలో చివరికి అతను కూడా బానిసైపోయాడు. అతని భార్య నిర్మల. పేరులాగే ఆమె కూడా నిర్మల హృదయురాలు, అమాయకురాలు. అనుకూలవతియైన భార్య ఉండటం వల్ల శంకర్ ఎన్ని కష్టనష్టాలొచ్చినా నిలబడగలుగుతున్నాడు. అతని ముగ్గురు పిల్లలు, వారి పోషణ, చదువులు, పెళ్ళిళ్లు, అప్పులు, భార్య అనారోగ్యం అన్నింటితో తలమునకలై, బ్రతుకు బండిని భారంగా లాగుతున్నాడు.

ఈ విధంగా భారవంతమైన జీవితం గడుపుతున్న శంకర్‌కి చిన్ననాటి నుండి ఒక ఆశ. పల్లెటూరిలో పుట్టి పెరగడం వలన అతను కదిలే చెట్ల రెమ్మలు, కొమ్మలు చూసాడు. కానీ, కదిలే సముద్రాన్ని చూడాలని, ఆ అలల మధ్య ఆడుకోవాలని ఇంకా! చిన్నపుడు సినిమాల్లో చూసినట్టు పిల్లలు ఇసుకతో గూళ్ళు కట్టుకోవడం, పుస్తకాలల్లో చదివినట్టుగా అక్కడ చల్లని గాలి వీస్తుందని మరియు సూర్యోదయాస్తమయాలు చాలా బాగుంటాయని వినడం వలన కానీ అతనికి సముద్రం చూడాలని కోరిక. అతనికి ఎంతో కాలంగా ఇది నెరవేరకుండానే ఉండిపోయింది. చిన్ననాటి నుండి ఉన్న ఆ ఆశను నెరవేర్చుకోవాలని పెళ్ళైన కొత్తలో తన భార్యతో కలిసి విశాఖపట్టణానికి వెళ్ళాలనుకున్నాడు. కాని దూరపు బంధువులెవరో చనిపోవడంతో ఆ ప్రయాణం కాస్తా ఆగిపోయింది. అలా ఆరోజు అనుకున్నది ఈ నాటి వరకూ కూడా ఎన్నో బరువు, బాధ్యతల వల్ల తీరకుండా పోయింది.

శంకర్ రోజులాగే ఉదయాన్నే హడావిడిగా ఆఫీసుకి వెళ్ళాడు. ఎక్కడ పని ఉండడం వల్ల తీరిక అనేది లేకుండా ఉన్నాడు. ఆ సమయంలో హఠాత్తుగా ప్యూన్ వచ్చి, 'ఆఫీసర్ గారు, అర్జెంట్‌గా రమ్మంటున్నారు'. అనగానే చేసే పనిని ఆపి, ఆఫీసర్ దగ్గరికి వెళ్ళాడు. వెళ్ళగానే ఆఫీసర్ "ఏమోయ్ శంకర్! నువ్వు క్యాంప్‌కి వెళ్ళాలోయ్" అన్నారు. "ఏవూరు సార్?" నీరసంగా అని అన్నాడు

"మన హెడ్ ఆఫీస్‌లో అర్జెంటుగా కొన్ని ఫైల్స్ చెక్ చేయాలి" అన్నారు, ఆఫీసర్‌గారు. "నా భార్యకు అనారోగ్యంగా ఉంది సార్! తనను చూసుకోవాలి" అన్నాడు శంకర్. అలా చెప్పగానే ఆఫీసర్‌గారు "నువ్వు ఖచ్చితంగా మన హెడ్‌ఆఫీస్, అంటే విశాఖపట్నంలో ఉందే అదే! అక్కడ పరిస్థితి అస్సలు బాగోలేదు. కష్టపడే వ్యక్తి నిజాయితీగల మంచి వ్యక్తిని పంపమన్నారు. నాకేమో నీ మీద చాలా నమ్మకం మరి" అన్నారు. "ఏంటి సార్! ఎక్కడికెళ్ళాలి ?" సంభ్రమంగా రెట్టించాడు. శంకర్ "విశాఖపట్నమయ్యా! ఎందుకయ్యా అంత గాబరాపడతావు? ఐదురోజులేగా వచ్చాక నాలుగు రోజులు లీవ్ ఇస్తానులే" అన్నారు. ఆ తర్వాత శంకర్ చాలాసేపు ఆలోచించి, 'నా కల తీరే సమయం వచ్చింది. దీనిని సద్వినయోగం చేసుకోవాలి' అని అనుకొని బయలుదేరాడు.

విశాఖపట్నంలో వెళ్ళిన తన పని పూర్తిచేసుకొని, అతడు సముద్రతీరానికి వెళ్ళాడు. అక్కడ చాలా చక్కగా చల్లనిగాలి వీస్తుంది. అతనికి అక్కడ కలిగినంత సంతోషం, ఆనందం వేరెక్కడా కలగలేదు. అంత ఆహ్లాదకరమైన వాతావరణంలో అతనెప్పుడూ వుండలేదు. ఎన్నో కష్టాలతో, పనులతో భారవంతమైన జీవితం గడుపుతున్న అతనికి, అక్కడ చాలా ఆనందంగా అనిపించింది. ఆ అలల శబ్దం అతడిలో నూతన ఉత్తేజాన్ని నింపింది. ఆ అందమైన తన అనుభవాన్ని తన భార్యతో పంచుకోవాలనుకున్నాడు. కానీ, అతని భార్య అంతకుమునుపే అనారోగ్యంతో ఆసుపత్రిలో చేర్చబడింది. తన భార్యకు ఎలాగైనా తను పొందిన అనుభూతిని కలిగించాలనే ధృఢనిశ్చయానికి వచ్చాడు. ఎలాగా! అని ఆలోచిస్తుండగా ఒక ఉపాయం తోచింది. వెంటనే "ఒక శవపెట్టె కొన్నాడు. దాంట్లో కొంత సముద్రపు ఒడ్డున వుండే ఇసుకను పోసి, దానిని కొద్దిగా నింపాడు." అక్కడ వీచే చల్లని గాలిని అందులో పట్టాననుకొని భ్రమపడి దానిని మూతపెట్టాడు.

ఆ ఇసుక నింపిన పెట్టెను ఆసుపత్రిలో వున్న తన భార్యకు పంపించాడు. ఆ పెట్టెతో పాటుగా ఒక చిన్న ఉత్తరం పంపించాడు. అందులోని సారాంశం ఏమిటంటే, నేను సముద్రతీరానికి వెళ్ళినపుడు, అక్కడ వీచినటువంటి ఎంతో ఆహ్లాదకరమైన చల్లనిగాలి నాకు చాలా ఆనందం కలిగించింది. ఆ అనుభూతిలోని ఆనందాన్ని నువుకూడా అనుభవించి ఆనందించాలని ఎంతో ప్రేమతో నేను దీనిని నీకు పంపిస్తున్నాను. "ఈ పెట్టెలో పడుకొని నీవు గట్టిగా మూతవేస్కో.

లోపల వున్న సముద్రపు గాలి నీకు అనుభవానికొస్తుంది, నీవు కూడా నాలా సంతోషాన్ని పొందుతావు. నీ ఆరోగ్యం త్వరగా బాగుపడుతుంది రెండు రోజుల్లో నేవస్తాను.” అని రాసి, దానిని పెట్టెతో పాటుగా భార్యకు పంపించాడు. ఆ తర్వాత అతని భార్య, గాలి ఏమైనది అని వేరే చెప్పనవసరం లేదు కదా!

అదే విధంగా ఎదుటివారు చెప్పిన జీవిత కథలు, వారి జీవితాల లోని లోటుపాట్లు, చదివిన కథలు, మహాత్ముల జీవితాలు చదివినంత మాత్రాన మనం అందరికంటే మేధావులం అయిపోం. మనకు చాలా జ్ఞానము సిద్ధించింది అని అనుకోవడం. ‘‘శంకర్ పెట్టెలో వడుకొని నముద్రవు గాలిని అనుభవించమనడమే” అవుతుంది. ఈ రెండింటి మధ్య పెద్ద తేడా లేదు. అతనికి ఏర్పడిన ఆ అనుభవం నిజంగా అతని భార్యకు కలగాలంటే ఆ సముద్రపు ఒడ్డును చేరే మార్గాన్ని అయినా చూపించాలి ‘లేదా’ మనమైనా ఆమెను తీసుకెళ్ళాలి.

మహాత్ములు తన జీవితానుభవాలను జాగ్రత్తగా దాచి, రాసుకున్నవి వారి జీవిత చరిత్రలు, వాటిని బట్టీ పట్టీ చదివినంత మాత్రాన మనకు అనుభవాలు రావు. వారు వారి జీవితంలో ఎదుర్కొన్న పరిణామాలు తెలియచేయడం వల్ల అలాంటివి ఎదురైనపుడు, ఎలా సాహసంతో వ్యవహరించాలి. అని తెలుసుకుంటాము. వారు చెప్పినవి మనం అనుభవంలోకి తెచ్చుకుంటేనే, మనం ఉన్నతులుగా ఉంటేనే మన జీవితం బావుంటుంది. మనం మన జీవితాన్ని ఎలా అనుభవించుకోవాలో మనమే నేర్చుకోవాలి.‘‘విజ్ఞతతో ఆలోచించడం, క్రమశిక్షణతో మెలగడం, నిజాయితీగా బ్రతకడం వంటి నిజాలను పెద్దల అనుభవాల నుండి గ్రహించాలి. వాటిని మనం సాధన చేయాలి. అప్పుడే ఆనందం మన సొంతమౌతుంది. అందరం అలాగే బ్రతుకుదాం! అందరం జీవితాన్ని ఆనందంగా అనుభవిద్దాం”.

వాయిదాల వరదాచారి

కె. శ్రీవాణి యాదవ్, ద్వితీయ బి.కాం.సి.ఎ

వంగాపురం అనే ఒక ఊళ్లో ఒక బీద బ్రాహ్మణుడు ఉండేవాడు. అతని పేరు వరదాచారి. నిత్యం పనులను వాయిదా వేస్తుండేవాడు. అతని వాయిదాల వలన ఏ పనిని సక్రమంగా చేసేవాడుకాదు. దీనికి తోడు అతని సోమరితనం కూడా ఒక కారణమైంది. ఇవన్నీ కలిసి అతని పేదరికానికి దారి తీశాయి.

ఇలా రోజులు గడుస్తున్నాయి. వరదాచారి ఒక రోజు ఆ ఊరి రాజుగారింటికి వివాహానికి హాజరు కావాల్సి వచ్చింది. ఆ ఊరి వాడు ఒకతను రాజుగారింట వివాహానికి వెళ్తూ వరదాచారిని రమ్మని అడిగాడు. అప్పుడు వరదాచారి "ఇక్కడి నుంచి రాజుగారి భవనం చాలాదూరం. నువ్వు వెళ్ళు నేను కొద్దిసేపటి తర్వాత వస్తాను" అని జవాబిస్తాడు. అప్పుడు అతను వెళ్ళిపోతాడు.

వరదాచారి కొద్దిసమయం తర్వాత తనకు వెళ్ళడం బద్ధకమైనా ధనం ఇస్తారన్న ఆశతో బయల్దేరుతాడు. ఆ మార్గ మధ్యలో అతని ఇంటికి వచ్చినవాడు ఎదురు వస్తాడు. అతను వరదాచారితో "నేను రమ్మని పిలిచినప్పుడు రాలేదు. రాజు అందరికి గొప్ప గొప్ప బహుమానాలు ఇస్తున్నాడు. నువ్వు వెళ్ళేసరికి ఈ బహుమానాలన్నీ అయిపోతాయి. ఇంతదూరం నేను నడిచిన ప్రయోజనం ఉండదు. మళ్ళీ ఎప్పుడైనా రాజుగారింట్లో శుభకార్యానికి వెళ్ళవచ్చు అనుకుంటాడు." వరదాచారి కాని తాను సగం దూరం నడిచి వచ్చాడని తెలుసుకొని, "ఇంకొద్దిదూరం వెళ్తే రాజుగారిల్లు వస్తుంది. రాజు దగ్గరికి వెళ్ళే ఏదైనా ఒక చిన్న బహుమానం ఇస్తాడుకావచ్చు" అన్న ఆశతో మళ్ళీ బయల్దేరుతాడు.

చివరకు రాజుగారి భవనాన్ని సమీపిస్తాడు. అక్కడ బహమానాలు తీసుకొనే వారు పద్ధతిలో నిల్చొని తీసుకుంటున్నారు. అతను కూడా ఆ వరుసలో నిల్చుంటాడు. తన వంతు వచ్చాక. అతనికి రాజు కొంత ధనాన్ని, దానితో పాటు ఒక ఆవును బహమానంగా ఇస్తాడు. ఆ బ్రాహ్మణుడు ఎంతో సంతోషంతో తాను ఇంతదూరం వచ్చినందుకు ఫలితం దక్కిందని సంతోషంతో ఆ ఆవుతో, ధనంతో ఇంటికి బయల్దేరాడు.

ఇంటికి వెళ్ళి స్తంభానికి ఆవును కట్టేస్తాడు. ఇంటి తలుపులు తెరచి మంచి నీరు త్రాగి, ఆవుకి గడ్డి పెడదామని బయటికి వస్తాడు. ఆ ధనాన్ని తనతో పాటే ఉంచుకుంటాడు. కాని, "నేను వివాహానికి వెళ్ళి వచ్చి చాలా అలసిపోయాను. కాసేపు విశ్రాంతి తీసుకుంటాను. రేపటి నుండి ఆ ఆవుకు గడ్డి పెట్టి ధనాన్ని ఎక్కువగా ఆర్జిస్తాను" అంటూ అరుగు మీద పడుకొని, నిద్రలోకి జారిపోతాడు.

నిద్రలో కలలు కంటూ "ఈ ఆవుకు రోజు ఉదయం, సంధ్యాకాలం గడ్డిపెడతాను. దాని వల్ల అది ఎక్కువ పాలను ఇస్తుంది. ఆ పాలను అమ్మి వాటి నుండి డబ్బు సంపాదిస్తాను. అలాగే దాని పేడను అమ్మి, డబ్బు సంపాదిస్తాను. ఆ ఆవు ఇచ్చిన పాలతో జున్ను, పెరుగు, వెన్న తయారు చేసి దానిని కూడా అమ్ముతాను. ఆ ఆవు ఇంకొక ఆవును ప్రసవిస్తుంది. అది మరొకటి, అది మరొకటి. అప్పుడు నేను పాల వ్యాపారాన్ని ప్రారంభిస్తాను. ఎక్కువగా లాభాలను ఆర్జిస్తాను. ఆవిధంగా వచ్చిన లాభాలతో ఒక పెద్ద ఇల్లును కడుతాను. ఆ ఇంట్లో రాజులకుండే వసతుల లాగా అన్నింటినీ అమరుస్తాను. అప్పుడు గొప్ప గొప్ప ధనవంతులందరూ నన్ను అల్లునిగా చేసుకోవడానికి పోటీవడుతారు. కానీ నేను మాత్రం మనస్సుకు నచ్చిన యువతినే వివాహం చేసుకుంటాను." అంటూ కలలు కంటూ, నిద్రపోయారు.

ఆరోజు రాత్రి బ్రాహ్మణుని ఇంట్లో దొంగలుపడుతారు. కాని బ్రాహ్మణునికి మెళుకువ ఉండదు. దొంగలు, బ్రాహ్మణుని ప్రక్కనే వున్న ధనం మూటతోపాటు, ఆవును కూడా దొంగిలిస్తారు.

వరదాచారి వేకువజామున లేచి ఆవుకి గడ్డిపెడదామని అనుకుంటాడు, కాని బద్ధకంతో బాగా పొద్దెక్కిన తర్వాత నిద్రలేస్తాడు. తన ప్రక్కన వున్న ధనం మూట లేకపోయేసరికి కంగారు పడి, ఆవు దగ్గరికి వెళ్తాడు. అక్కడ ఆవు కూడా ఉండదు. ధనాన్ని ఎక్కడైనా పెట్టి ఉంటానని ఇల్లంతా వెతుకుతాడు కాని దొరకదు. ఆవు తాడు తెంచుకొని ఎక్కడికైనా వెళ్ళిందా అని ఊరంతా వెతుకుతాడు. పొలాల్లో, గట్లల్లో ప్రతిచోట వెతుకుతాడు. కాని ఆవు కన్పించకపోయేసరికి, భాధతో ఇంటికి తిరిగి వస్తాడు.

అప్పుడు, తన ఇంట్లో దొంగలు పడ్డారన్న విషయం తెలుసుకొని చాలా దుఃఖించాడు. ఇంక ఎప్పుడూ ఏ పనిని వాయిదా వేసి, అనవసరమైన ఆశలకు

పోయి. కలలు కనవద్దని నిశ్చయించుకుంటాడు.

కాబట్టి ప్రతి ఒక్కరూ కూడా వాయిదాల వరదాచారి వలె కాకుండా, ఏరోజూ పనిని ఆరోజు, నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేయాలి. అప్పుడే మనం ఆ పనిలో విజయం సాధించి, మన లక్ష్యాన్ని చేరుకుంటాము.

ఎత్తుకు పైఎత్తు

ఎమ్. స్వాతి, ప్రథమ బి.జడ్.సి.

గోవిందయ్య, సుశీలమ్మ పేద దంపతులు వీరికి ఒక కూతురు, పేరు సరిత. వీరిద్దరు వ్యవసాయం చేస్తూ ఉండేవారు. రెండు జతల మేకలు ఉన్నాయి. ఒకసారి వీరికి పంట నష్టం వచ్చింది. గోవిందయ్య బాధపడుతూ ఉండగా గోవింయ్య స్నేహితుడు అయిన రంగన్న ఎందుకు బాధపడుతున్నవు అని గోవిందయ్యను అడిగాడు. మాకు పంట నష్టం వచ్చింది. అని రంగన్నతో బాధపడుతూ చెప్పాడు. ఎందుకు బాధ పడుతున్నావు. అని నచ్చచెప్పి రంగన్న ఇంటికి వెళ్ళిపోయాడు. గోవిందయ్యను చూచి ఎందుకు అలా ఉన్నారు అని అడిగింది భార్య. మనకు పంటనష్టం వచ్చింది. అన్న గోవిందయ్యతో సుశీలమ్మ తమ దగ్గర ఉన్న మేకలల్లో ఒక మేకను అమ్ముదాము అని ధైర్యం చెప్పింది. గోవిందయ్య 'సరే' అన్నాడు. సుశీలమ్మ మేకను తీసుకొని ఒంటరిగా పొరుగూరు సంతలో అమ్మడానికి తీసుకువెళ్తున్నది. గోవిందయ్య స్నేహితుడు అయిన రంగన్న ఇంటి నుంచి బయలుదేరి ఇంటికి వచ్చాడు. సుశీలమ్మ కనబడకపోవడంతో తన కూతురు అయినటువంటి సరితను అమ్మ ఎక్కడికి వెళ్ళింది అని అడిగాడు. అమ్మ పొరుగూరి సంతకు మేకను అమ్మడానికి ఒక్కతే వెళ్ళింది. అన్నది సరిత.

"ఎందుకు ఒక్కత్తే వెళ్ళింది? ఎవరినైన తోడు తీసుకెళ్ళొచ్చుగా అని గోవిందయ్య అన్నాడు. సుశీలమ్మ మేకను తీసుకుని ఒంటరిగా వెళ్ళడం చూచి అక్కడ ఉన్నటువంటి ముగ్గురు దొంగలు ఆమెను అమాయకురాలను చేసి మేకను తస్కరించుకొని పారిపోయారు. సుశీలమ్మ మేకను తీసుకెళ్ళినటువంటి దొంగలను వెతికింది. అయిన వాళ్ళు అప్పటికే పారిపోయారు. సుశీలమ్మ ఇంటికి నిరాశగా వచ్చింది. గోవిందయ్య సుశీలమ్మను చూచి 'ఎందుకు అలా నిరాశగా ఉన్నావు?' అని గోవిందయ్య అడిగాడు. జరిగిన విషయంమంతా గోవిందయ్యకు బాధపడుతూ చెప్పింది. సుశీలమ్మని అమాయకురాలినిచేసి మేకను ఎత్తుకెళ్ళారనే విషయం అర్థం అయ్యింది.

గోవిందయ్య వెంటనే సంతకెళ్ళి రెండు కుందేళ్ళను తీపుకొని వచ్చాడు. తన పథకం ఏమిటో భార్యకు వివరించి చెప్పాడు. ఒక దాన్ని ఇంట్లోపంజరంలో

ఉంచి మరొక కుందేలుని చేతితో పట్టుకుని బయలుదేరాడు. చెట్లతోపు దగ్గరకు రాగానే ఆ ముగ్గురు దొంగలు గోవిందయ్యను చూశారు. అతన్ని మాటల్లో పెట్టి అతని దగ్గర డబ్బేమైనా ఉంటే దోచుకోవాలనుకున్నారు. ముగ్గురు దొంగలు గోవిందయ్యతోపాటే నడవడం మొదలుపెట్టారు. "కుందేలును తీసుకొని ఎక్కడికే వెళ్తున్నట్లున్నారు?" అని ముగ్గురు దొంగలల్లో ఒక దొంగ అడిగాడు "సంతలో అమ్మటానికి తీసుకొని వెళ్ళుతున్నా" అని గోవిందయ్య చెప్పాడు.

"ఎంతకు అమ్ముతారేమిటి ?" అని మరొకదొంగ అడిగాడు.

"అయిదు వేలు"

"ఏమిటి ? ఈ కుందేలు అయిదు వేలా? మీకేమైనా పిచ్చా" అని దొంగలు ఆశ్చర్యపోయారు.

గోవిందయ్య – "ఈ కుందేలు మామూలు కుందేలు కాదు. ఇది మనం చెప్పిన పనులన్నీ చేస్తుంది. పైగా మాట్లాడు తుంది" అని గోవిందయ్య చెప్తాడు.

"కుందేలు ఇవన్నీ చేయగలదా ? మేమునమ్మం" అన్నారు దొంగలు.

"అయితే ఒక పని చేద్దాం, దీనికి నేను కొన్ని విషయాలు చెప్పి మా ఇంటికి పంపిస్తాను. తరువాత మనం వెళ్ళొద్దాం మీ కళ్ళతో మీరే చూడవచ్చు. నిజమో కాదో మీకే తెలుస్తుంది." అని గోవిందయ్య దొంగలతో చెప్పాడు. గోవిందయ్య కుందేలు చెవులు పట్టుకొని పైకి లేపి దొంగలకు వినబడేటట్లుగా దాని చెవి దగ్గర నోరు పెట్టి "లక్ష్మణా నేను సంతకి వెళ్ళడం లేదు తిరిగి వస్తున్నానని అమ్మతో చెప్పు, నాతో పాటు ఇంకా ముగ్గురు అతిథులు వున్నారని, భోజనం ఏర్పాటు చేయాలని తొందరగా వెళ్ళి అమ్మతో చెప్పు" అని చెప్పి కుందేలును క్రిందికి వదిలాడు. కుందేలు చూస్తుండగానే పొదల వైపునకు పరిగెడుతూ వెళ్ళిపోయింది. కాని దొంగలు కుందేలు ఇంటికి వెళ్ళింది అని నమ్మారు.

"గోవిందయ్య ఇప్పుడు మా ఇంటికి వెళదాం పదండి" అని ఆ ముగ్గుర్ని తీసుకొని ఇంటికి వెళ్ళాడు. గోవిందయ్య ఇంటి ముందు పెరడుల్లో కుందేలు పంజరంలో క్యారేటు తింటూ కనిపించింది. గోవిందయ్య అప్పుడు దొంగలతో ఇలా అన్నాడు. "చూశారా! మనకంటే ముందే వచ్చేసింది" అని దొంగలతో చెప్పి గుమ్మం వైపు చూస్తూ "ఏమేవ్ వంట సిద్దం అయ్యిందా ? అంటూ

గట్టిగా కేకేశాడు.

"ఆ..!ఆ..! మీతో పాటు ఎవరో ముగ్గురు వస్తున్నారని మాంసం కూర, పూరీలు, పాయసం వండమని" లక్ష్మణుడు చెప్పాడు. ఇవన్నీ అంత త్వరగా అవుతాయా? కాసేపు వేచి ఉండాలి." అని లోపలి నుండి గోవిందయ్య చెప్పమన్నట్టే చెప్పింది. సుశీలమ్మ. ముగ్గురు దొంగలు ఆశ్చర్యంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. గోవిందయ్య లోపలికి వెళ్ళగానే దొంగలు గుసగుసలాడుకున్నారు.

"దొంగలు గోవిందయ్యను ఇది ఎవరికో అమ్మటం ఎందుకు ? మాకే అమ్మండి ప్రస్తుతం మా దగ్గర నాలుగు వేలు మాత్రమే ఉన్నాయి. మళ్ళీ మిగతా డబ్బు ఇస్తాం" అన్నారు. మొదటి గోవిందయ్య ఒప్పుకోలేదు. గోవిందయ్యను దొంగలు రకరకాలుగా చెప్పి ఒప్పించారు. గోవిందయ్య 'సరే' అని వాళ్ళదగ్గర నాలుగు వేలు తీసుకొని కుందేలును ఇచ్చేశాడు. దొంగలు ఎంతో సంతోషంగా ఆ కుందేలుని తీసుకొని వెళ్ళిపోయారు.

మోసం చేసి మేకను తీసుకున్న దొంగలకు ఆ పద్ధతిలోనే జవాబు చెప్పినందుకు గోవిందమ్మ, సుశీలమ్మ ఎంతో సంతోషించారు.

మట్టిపల్లకి

జంకదు(డా॥ జె.కనకదుర్గ, ప్రిన్సిపాల్)

తొలిఉషస్సు మెలమెల్లగా తన కిరణాలతో ఆకాశమంతా పరుచుకుంటుంటే చీకట్లు తమంతటతామే తప్పుకుంటున్నాయి. విమానంలో నుంచి విహంగవీక్షణం చేస్తున్న కిరణ్‌కి భూమ్యాకాశాలు కలిసిపోయి చీకటివెలుగుల మాయాజాలంలో పల్లెలు నిద్రలేస్తున్నట్లనిపించింది. మరు నిముషంలోనే మా అంతటి వాళ్ళు లేరంటూ పెద్ద పెద్ద మేడలు నిక్క పొడుచుకొని జిగేల్‌మనే లైట్లతో తొలికిరణాల వెలుగులకు గుర్తింపు లేకుండా చేయాలనుకుంటు పోటిపడుతున్నట్టనిపించింది. నగర జీవనం లేవటానికి బద్ధకిస్తూ జలతారు ముసుగు కప్పుకొని మళ్ళీ నిద్ర లోకి జారుకుంటోంది. "యువర్ అటెన్షన్ ప్లీజ్" వియార్ లాండింగ్ టు హైదరాబాద్" అని మైకులో వినబడ్డ ఎయిర్ హోస్టస్ మాటలకు ఒక్కసారిగా తుళ్ళిపడి లేచిన భానుమతమ్మ విప్పారిన కళ్ళతో చుట్టూరాచూస్తూ "అబ్బ ప్రాణం లేచివచ్చినట్లుందిరా కిరణ్; ఆంధ్రలో అడుగుపెట్టగానే" అంది నిద్రమత్తును వదిలించుకుంటూ. "ఆ(...... ఆ(...... ముందు దిగమ్మా" అంటూ తల్లిని తొందరపెట్టాడు కిరణ్. "తాతయ్య కారు పంపిస్తానని ఫోన్ చేశాడు. ఈ పాటికి వచ్చేసుంటూందిలే" అంటూ సీటులో నుండి లేచింది భానుమతమ్మ.

"సామాను తీసుకొని బయటకు వెళ్ళినతర్వాత ఆ విషయం ఆలోచించుకోవచ్చులే ముందు దిగు వెడదాం" అంటూ కిరణ్ తన తల్లి చేయిపట్టుకొని మెట్ల మీదనుండి దిగివచ్చి బెల్టు దగ్గర నిలబడి సామానును తీసుకొని చెకింగ్ తతంగాన్ని పూర్తిచేసుకొని బయటపడ్డాడు. టాక్సీలవాళ్ళతో హడావుడిగా ఉంది హైద్రాబాద్ విమానాశ్రయ ప్రాంగణం. ఇంతలో "భానుమతమ్మ గారూ! బావున్నారా!' ఓ..మనబ్బాయిగారేనా? బాబును చూసి చాలారోజులైందమ్మా" అంటూ సంతోషంగా పలకరిస్తున్న ఒక వ్యక్తిని చూసి మాఅబ్బాయే సుబ్బన్నా! అవును నీ ఆరోగ్యం ఎలా ఉంటోంది' అంటూ కుశల ప్రశ్నలు వేసి అతని ప్రక్కన నిలబడ్డ ఆ కుర్రాడివైపు చూసి "ఎవరూ"? అంటూ

అడిగింది భారతమ్మ.

"అమ్మా! వీడు మా అబ్బాయి రవి. డ్రైవింగ్ నేర్చుకొని ఇక్కడ టాక్సి నడుపుకుంటూ బతుకుతున్నాడు. మా బాబును గుర్తుపడతారో లేదోనని నేను కూడా వచ్చాను' అంటూ "రవీ॥ భానుమతమ్మ గారి సామాను అందుకోరా' అంటూ వాళ్ళబ్బాయిని తొందరపెట్టాడు.

"సుబ్బన్నా! పెద్దవాడివయ్యావు. ఈ తుంపరలో తడుస్తూ మా కోసం వచ్చావా! మన ఊరివాళ్ళంతా బాగున్నారా? అంది ఆప్యాయంగా. ఈ లోపల రవి సామాన్లు దూరంగా ఉన్న కారులో పెట్టి వీళ్ళున్న చోటికి కారును తెచ్చాడు. వెనక సీట్లో తల్లీ కొడుకులు కూర్చున్నారు.

ముందుసీట్లో కూర్చున్న సుబ్బన్న "అమ్మా మన ఊరికి మీరొచ్చి ఏ పదేండ్లో దాటి నట్టుంది. ఇప్పుడు ఊరంతా మారిపోయింది చూస్తారుగా" అంటూ కిరణ్ వైపు తిరిగి "ఏంటమ్మా మన అబ్బాయిగారు అలా ముభావంగా ఉన్నారు. చిన్నప్పుడు తాతగారింటికి వచ్చినప్పుడు మా రవితో కలిసి చెట్లమ్మటా పుట్టలమ్మటా తిరుగుతుండేవాడు. చేలగట్లకు వెళ్ళి చెరుకుగడలు తెచ్చి ఊళ్ళో పిల్లలకు ఇస్తుండేవాడు. ఎప్పుడూ పది మందిని వెంటేసుకుతిరిగేవాడు. అవునులేమ్మా! ఇప్పుడు పెద్దవాడయిపోయి అమెరికాలో ఉండేసరికి బాబుగారిలో మార్పురావడం సహజం లేమ్మా" అంటూ తనకు తెలియకుండానే ఒక నిట్టూర్పు వదిలాడు. వెంటనే కిరణ్ గంభీరంగా చూసి 'లేదు సుబ్బన్నా! చుట్టూరా విచ్చుకున్న వెలుగుల మధ్య జుట్టు రేగినట్లుగా ఉన్న గుడిసెలు, అక్కడక్కడా మట్టి పెళ్ళలను నెత్తిమీద పెట్టుకున్నట్టున్న పెంకుటిళ్ళను చూస్తుంటే నా బాల్యం గుర్తుకు వస్తోంది." అంటూ తదేకంగా డ్రైవ్ చేస్తున్న రవివైపు తిరిగి 'రవీ! చిన్నప్పుడు మనం పోటీపడి చెరువుగట్టున ఉన్న బంక మట్టితో రకరకాల బొమ్మలు చేసేవాళ్ళం. చిన్నప్పటి తీపి గుర్తులు అప్పుడప్పుడు లీలగా మెదడును కెలికేస్తుంటాయి. నా చిన్నప్పుడే ఆ ఊరును వదిలిపెట్టి హైద్రాబాదు వచ్చేసాము కదా! అవును రవీ! మీరెంతవరకు చదివారు" అన్నాడు కిరణ్.

"మన ఊళ్ళో పంచాయితీ స్కూల్లో పదివరకు చదివాను. మానాన్న చదివింది చాలు పొలం చూసుకోమని పోరు పెడితే చదువు మానేశాను. ఆపని

మీద శ్రద్ధలేక హైద్రాబాద్ వచ్చి యిదిగో..... ఇలా టాక్సీ నడుపుకుంటున్నాను" అన్నాడు కొంత అసంతృప్తితో.

వీళ్ల మాటలు విన్న భానుమతమ్మకి ఆమె మనస్సు ఆమె కంటే ముందే ఆ ఊరు చేరుకోవటంతో సంబరపడుతూ 'సుబ్బన్నా! అన్నాలుతినే వేళకి ఊరు చేరుకుంటామా? ఇంట్లో అందరూ భోజనాలు చేయకుండా వస్తున్నాంకదా అని అందరూ మన కోసం ఎదురుచూస్తుంటారేమో" అంది ఏదో గుర్తుకు వచ్చిన దానిలా! 'ఆఁ! వెళ్ళి పోతామమ్మా యిదిగో ఈ వాన తుంపరలు ఎక్కువైతే మరో గంట పట్టవచ్చు".

"పోనిలే సుబ్బయ్యా; మరో గంట పట్టినా ఫరవాలేదులే. పంటలు పండాలంటే వానలు బాగా కురవాలి కదా! అవునూ! మీ పొలాలెలా ఉన్నాయి? పంట దిగుబడి బాగా ఉంటోందా?

"ఏ వానలో ఏమిటోనమ్మా అతివృష్టి, అనావృష్టి! సకాలంలో వానలు కురవటం లేదు. అదేమంటే అంతా కాలుష్య ప్రభావం అంటున్నారు. ఒక్కొక్కప్పుడు తాగటానికి నీటి ఎద్దడి కూడా ఏర్పడుతోందమ్మా. ప్రభుత్వం అదేదో మేఘ మథనం చేస్తాం అంటోంది. మరి చూడాలి" అన్నాడు నిరాశగా సుబ్బన్న. "అదేమిటి సుబ్బన్నా! మన ఊరి చెరువు నిండా నీళ్ళు ఉండేవిగా, వేసవి కాలంలోకూడా నీళ్ళుండేవికదా. ఇబ్బందే ఉండేది కాదు, అయ్యో ఇప్పుడేమయింది. అవును సుబ్బన్నా రేపు వినాయక చవితి కదా మనఊళ్ళో చవితి పందిళ్ళు వేశారా? నా చిన్నతనంలో నవరాత్రిళ్ళు ఎంతబాగా జరిగేవి. పండగ నాటికి చేరుకుంటానో లేదోనని హడావుడి పడ్డా. కిరణ్ కి మన ఊళ్ళో వినాయక చవితి చూపిస్తే మన సంస్కృతి అంటే ఏమిటో అర్థమవుతుంది". అంది భానుమతమ్మ కొడుకు వైపు చూస్తూ.

"ఏమిటమ్మా ఎప్పుడూ మన సంస్కృతి, మన సంస్కృతి, అంటూ గోల పెడతావు. వినాయకుడికి పూజ చేయటం మన భారతీయ సంస్కృతి, సరే అలాగే అన్ని దేశాల్లో వాళ్ళవాళ్ళ మతాల ప్రకారం ప్రార్థనలు చేసుకుంటారు కదా..." అన్నాడు. కిరణ్ ఎటో ఆలోచిస్తున్నాట్టుగా. అతని మాటలు పూర్తి చేయకమునుపే భానుమతి అందుకుని "మన సంస్కృతి, వేరురా... మనదెంతో

గొప్ప సంస్కృతిరా... మనది వ్యవసాయ సంస్కృతి. మన సంస్కృతికి పట్టుగొమ్మలు పల్లెటూళ్ళురా. అక్కడికి వెడితే గానీ నీకు అర్థం కాదు" అంది.

తల్లికి ఆంధ్ర దేశమన్నా తాను పుట్టిన గ్రామమన్నా ఎంత మక్కువో' అని మనసులో అనుకుంటూ కిరణ్ కుండపోతగా కురుస్తున్న వర్షాన్ని కారు డోరు గ్లాసుల్లో నుంచి చూస్తు రోడ్డుకు ప్రక్కనున్న ప్రదేశాలను కూడా చూడటానికి ప్రయత్నిస్తున్నాడు. వర్షపు నీళ్ళను కారు వైపర్ తుడుస్తుంటే రోడ్డను చూస్కుకుంటూ కారు నడపడంలో నిమగ్నమయ్యాడు రవి. భానుమతమ్మ మాటలు మనసులో పన్నీరు జల్లినట్లనిపించి సుబ్బన్న "అమెరికా వెళ్ళినా ఇంకా మన సంస్కృతిని గురించి మరచిపోలేదంటే మీదెంత మంచి సంస్కారమమ్మా" అన్నాడు.

"అదేమిటి సుబ్బన్నా! మన సంస్కృతిని అన్ని దేశాలు మెచ్చుకోవాల్సిందే. మనది చాలా పురాతనమైనది. మనకంటూ వారసత్వంగా వచ్చిన ఆస్తి మన సంస్కృతి, మనది గ్రామీణ సంస్కృతి కదా' అంది.

"అమ్మా అదేదో కాస్త వివరంగా చెప్పమ్మా నాకేమి అర్థం కావటం లేదు" అన్నాడు కిరణ్. "అవున్రా విదేశాలకెళ్ళటానికి వీలయిన చదువులు చదువుకున్నావు గానీ, మన ఉనికికి ముఖ్యమైన ఈ భూసంస్కృతిని వంటపట్టించుకోలేక పోయావురా' మన దేశం వ్యవసాయాత్మక దేశం. దాన్ని ఆధారం చేసుకొని మనం పండగలు జరుపుకుంటాము. అదిగో దూరంగా కనపడుతున్న ఆ పల్లెటూళ్ళను పంట పొలాలను చూడు. పచ్చ చీర కట్టుకున్న భూదేవి వర్షపు చినుకులకోసం వరినాట్లముక్కుపుటాలతో నీళ్ళు పీల్చు కోవాలని తపన పడుతోంది".

భానుమతమ్మ మాటలను వింటున్న సుబ్బన్న తలంపులు ఒక్కసారిగా అతని పొలం గట్ల తలుపులను తెరిచేసరికి ఆలోచనలలోకి వెళ్ళిపోయాడు.

"అమ్మా ప్రకృతిని చూస్తే నీకు కవిత్వం వస్తోందే!".

"అలా నవ్వకురా అబ్బాయి! ఈ వినాయక చవితికి మా ఊళ్ళో నవరాత్రి పూజలు పురాణ ప్రవచనాలు ఉండేవిరా "కులాలు, వర్గాలు లేకుండా అనాదిగా

ప్రతి ఇంట్లో చేసుకునే గొప్ప పండగరా ఇది" అంది భానుమతమ్మ ముఖంలో వెలుగులు నింపుకుంటూ...

"గొప్పపండగ, గొప్పపండగ అంటావు ఈ పండగకి ఉన్న గొప్పతనమేమిటమ్మా?"

"అదే చెప్తావినూ కిరణ్ నువ్వు అమెరికా వెళ్ళేవరకూ హైద్రాబాదులో ఉన్నంత కాలం పూజచేసేవాడివిరా అయితే నగరంలో పండగ పూజలు చేస్తే అదేదో మొక్కుబడి వ్యవహారంగా ఉండేది. కానీ పల్లెల్లో అదొక శాస్త్రీయమైన పండగ, శ్రామికుల పండగరా. నువ్వు వ్యవసాయ విద్యలో పరిశోధనలు చేసి సంకరవిత్తనాల తయారీకై తహతహపడుతున్నావు గానీ అంతకంటే పంటలు పండడానికి ప్రాథమికమైన విషయాలు ఈ పండగపనులలో ఉన్నాయని నీకెలా అర్థం అవుతుందీ? విత్తనాలు నాటాలంటే భూమి ఆధారం కదా. దానికి నీళ్ళు జీవం. ఈ రెండు ఉంటేనే విత్తనాలకు పోషకాహారం అంది, పైరు పెరిగి పంట చేతికి వస్తుందిరా..." ఆమె మాటలకు అడ్డు వచ్చి కిరణ్ "అమ్మా నువ్వు చెప్పే విషయాలలో కొత్త ఏముందమ్మా' అన్నాడు. 'ఆ(.. అలా అనకు పూర్తిగా విను. సాగునీటికి తాగునీటికి కరువులేకుండా చేసే పండుగా ఈ వినాయకుడి పండుగరా. వినాయకుడి పూజలో ఒక శాస్త్రీయభావం ఉంటుందిరా! "ఏంటమ్మా ఈ కంప్యూటర్ యుగంలో కూడా గజాననుడి పూజ చేయటం అంతా ఒక ఫార్సులా ఉంటుంది".

"కిరణ్ నీకు మౌళిక విషయాలలో అవగాహన తక్కువరా. ఇలా అన్నానని కోపం తెచ్చుకోకు. ఇందాకే చెప్పాకదా! నువ్వు తయారు చేసే విత్తనాలు పండటానికి నీళ్ళు పుష్కలంగా ఉండాలి కదా! నీటిఎద్దడి ఎక్కువవుతుంటే, చెరువులలో పూడిక తీయాలని ప్రభుత్వాలు సంకల్పిస్తున్నాయికానీ వినాయక చవితి పండగలోని తత్వాన్ని గుర్తించడం లేదురా".....

భానుమతమ్మ మాటలకు "తత్వమా" అంటూ అర్థం కానట్టు ముఖం పెట్టాడు కిరణ్ తల్లీకొడుకుల మాటలను ఏదో కలలో వింటున్నాట్టుగా వింటున్నాడు సుబ్బన్న.

"కిరణ్, నీకు తెలుసుకదా ఈ పండగలో ప్రధాన విషయం ప్రతి ఇంట్లో మట్టితో చేసిన వినాయకుడ్ని పెట్టి పూజచేయడం, దాని కోసం గ్రామంలోని చెరువుల్లో జిగటగా పేరుకున్న బంకమట్టిని తీసి వినాయకుడి బొమ్మ చేస్తారు. ఎన్నో వంపులతో తయారు చెయ్యాలి కదా వినాయకుడి బొమ్మని, దానికి అనువుగా ఉండేది ఆ చెరువులోని జిగట మట్టియే కదా! వేసవి కాలంలో ఎండిన చెరువు శ్రావణమాస వర్షాలకు మెత్తపడుతుంది. పైన పేరిన ఆ జిగట మట్టితోనే వినాయకుడి బొమ్మలను తయారుచేస్తారు. చెరువులో నీళ్ళు నిల్వ ఉన్న మేర పైన జిగటగా ఏర్పడుతుంది. పేరుకున్న, ఆ జిగట మట్టి ఉంటే వర్షపు నీటిని భూమి కుంభించుకోదు. పేరుకున్న జిగటను పైకితీస్తేగానీ నీరు భూమిలోకి ఇంకదు. అందరూ తలో చెయ్యి వేసి దేవుడి పేరుతో ఆ జిగటను పైకి తీసే కార్యక్రమం ఈ పండగలో ఉంది. దేవుడి పూజ చేద్దాం అంటేనే అందరూ తలా ఒకచెయ్యి వేసి ఆ జిగటను పైకి తీయటంలో భాగస్వామ్యులవుతారు. లేకపోతే ఎవరికివారే తమ కెందుకులే అని ఊరుకుంటారు. ఆరకంగా వర్షపు నీటిని బాగా పీల్చుకున్న చెరువుల్లో నీళ్ళు తాగటానికి వేసవి కాలం వరకు సరిపోతాయిరా! చెరువుగట్టు మీద ఉన్న పొలలకు సాగునీరు అందుతుంది ఆ రకంగా మన వాళ్ళు శాస్త్రీయంగా నీటి ఎద్దడిని తీర్చుకునే పద్ధతే ఈ వినాయకుడి పండగలో ఉందిరా కిరణ్" అంది భానుమతి నిండైన తృప్తిని అనుభవిస్తూ...

వింటున్న రవి "అమ్మగారు మీరు చెప్పింది అక్షరాలా నిజం. కానీ హైద్రాబాద్‌లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో రంగురంగుల వినాయకుడి విగ్రహాలు తయారు చేసి హుసేన్ సాగర్‌లో నిమజ్జనంచేస్తుంటే కాలుష్యం పెరిగిపోతోందని నిపుణులు గోల పెడుతున్నారమ్మా! చదువుకున్న వాళ్ళయినాకూడా ఈ నగర ప్రజలకు మీరుచెప్పిన సూక్ష్మం తెలీక ఎత్తు, ఎత్తు విగ్రహాలు పెట్టడంలో పోటీ పడుతున్నారు". అన్నాడు. తన బుర్రకేదో జ్ఞానోదయం కలిగినట్టుగా...

తల్లి మాటల్లో శాస్త్రీయత పూర్తిగా బోధపడని కిరణ్ పత్రితో పూజ చేయటం వెనుక ఏమన్నా అర్థం ఉన్నదామ్మా?'

"అదేరా! వినాయకుడికి గరిక పూజ యిష్టం అని వినే వుంటవుగా చెరువులో అడ్డంగా పెరిగిన గడ్డీ, రేగి వంటి కలుపు మొక్కలను పీకటం వంటివి

చేస్తారు." చెరువులోని నీటిని విషపూరితం చేసే బుడగతామర, జిల్లేడు వంటి మొక్కలను పీకేస్తేనే చెరువు నీళ్ళు శుభ్రపడి తాగడానికి వీలుగా ఉంటాయి. పూజకు వాడాలంటేనే ఆ ఊరి గ్రామస్థులు అంతకలసి చెరువుల్లో నుండి వాటిని పీక్కొచ్చి మరీ పూజ చేస్తారుగా! అంతే గాదురా ఆ ఆకులతో నట్టింట్లో తొమ్మింది రోజులు వినాయకుణ్ణి పూజ చేస్తే వానలకు యింట్లో ఏర్పడే క్రిములు కూడా నాశనం అవుతాయి." అంది భానుమతమ్మ ఎంతో నిండుగా.

"అయితే అమ్మా! ఆ మట్టి వినాయకుణ్ణి నవరాత్రిళ్ళ తర్వాత తిరిగి మళ్ళీ చెరువులోనే నిమజ్జనం చేస్తారెందుకు? అన్నాడు కిరణ్ ఇంకా ఏదో తనకు తెలియాల్సిన విషయం ఉన్నట్టు " ఆ మట్టి విగ్రహానికి తొమ్మిది రోజులు పూజచేస్తూ బయట పెట్టే సరికి ఆమట్టి ఎండి అందులోని జిగట పూర్తిగా పోతుంది. మళ్ళీ దాన్ని చెరువులో వేస్తే వర్షపు నీరును బాగా పీల్చుకుంటుంది. వానాకాలంలో చెరువులో మట్టి ఎంత బాగా నీళ్ళు పీల్చుకుంటే అంతగా వేసవి కాలంలో నీటి ఎద్దడి ఉండదు. చెరువు గట్టున ఉన్న పొలాలు రెండో పంటకు బాగా అందిస్తాయి." అంటున్న భానుమతమ్మ మాటలను స్వయంగా దైవం చెబుతున్నట్టుగా మనసులో భావించాడు సుబ్బన్న.

"అవునమ్మగారూ! ఈ మధ్య భూగర్భ శాస్త్రవేత్తలు వచ్చి మన ఊరి చెరువులో పూడిక తీయటానికి ఒక యంత్రాన్ని తెచ్చారు."

"ఆ(.. సాంకేతికత సౌకర్యాలను పెంచుతోంది. కాని ఆయంత్రాన్ని తయారుచేయటానికి ఒక ప్రక్కనుండి అనేకరకాలుగా కాలుష్యాన్ని పెంచుతున్నాం కదా" అన్నాడు రవి తనకు తెలిసిన కాస్త పరిజ్ఞానంతో.

"నువ్వు చెప్పింది నిజమే రవీ 'అంటూ వత్తాసు పలికాడు కిరణ్.

"అందుకే కదా యంత్రాలను వాడటం అనేది భౌతిక సంస్కృతి. కానీ వినాయకుడి పేరుతో చెరువుల్లో పైన పేరుకున్న జిగటను పూడిక పేరుతో గాక పూజ పేరుతో చేస్తే ఆత్మిక సంస్కృతి అభివృద్ధి చెందుతుంది..." అంది భానుమతమ్మ.

"అవునమ్మా! అందుకే జాతీయోద్యమ సమయంలో గణేష్ జయంతి

భారతీయులందరినీ ఒక్క తాటి పై నడిపించగలిగింది అన్నాడు" కిరణ్.

"బాగా చెప్పావురా!" అంది భానుమతమ్మ.

కిరణ్ తల్లివంక గర్వంగా చూస్తూ "అమ్మా! నీది పాతకాలంనాటి పెంపకం అనుకున్నాగానీ ఇంత శాస్త్రీయ పరిజ్ఞానం నీకు ఉందని యిప్పుడే తెలిసిందమ్మా. వినాయకచవితిపూజను భక్తిశ్రద్ధలతో చేస్తే బుద్ధి ప్రేరితమై సిద్ధి కలుగుతుందంటే యిదే అనుకుంటా" అంటూ మళ్ళీ బెరుకుగా "అమ్మా అంత బొజ్జ గణపతికి బుజ్జి ఎలుక వాహనం ఏంటమ్మా?" హాస్యంగా అనిపించదూ...."

"కాస్త ఆలోచిస్తే దానిలోనూ అంతరార్థం వుందిరా కిరణ్! చెరువుల్లో కప్పలుంటాయి కదా. ఆ కప్పలు చెరువు ఒడ్డునున్న పొలాల్లోని పురుగుల్ని తినటానికి వస్తాయి. ఆ కప్పలను తింటానికి ఎలుకలు వస్తాయిరా... ఇలా ఒకదానికొకటి ఆహారం అవుతూ ఉంటుంది. అలా పండిన పంటను చేతిలో ముద్దగా చేసుకు తినటంగా కనపడటవే వినాయకుడి బొమ్మలో ఉన్న పరమార్ధంరా. ఆ ఎలుకలు ఎక్కువైతే పాములు రావటం సహజం. అందుకే గజాననుడి భుజం మీదే జందెంరూపంలో పాము వేళ్ళాడుతుంది. చేతులకు చెరుకుగడ పంటలకు సంకేతం అలా ఆ బొజ్జవినాయకుడి విగ్రహంలో పంటలు పండే పరిణామక్రమం అంతా కనపడుతుంది. అందుకే మనది అన్నదాతల సంస్కృతిరా" అని ముగించింది. భానుమతి ఇంకేమీ చెప్పటానికి లేనట్టు.


"కరెక్ట్ గా చెప్పావమ్మా అందుకే వేదకాలానికిముందే చెరువుగట్లన ఉండే పొలాల్ని కాపాడేగణాలకు కాపుగాఉన్న ఒకడ్ని నాయకుడిగా చేసి "గణపతి" అంటూ ఆరాధించేవారట. ఈ పండగ ప్రకృతి వనరుల్ని పెంచటమే కాదు మానవ సంబంధాలను కూడా పెంచి ఆత్మీయతను పంచుకునే పండగ అనికూడా అర్థం అవుతోందమ్మా" అన్నాడు కిరణ్.

వాళ్ళ మాటలను వింటున్న సుబ్బన్నకు తనలో ఏదో కొత్త శక్తి పుంజుకుంటోందనిపించింది. వాన తగ్గి తుంపరలు పడుతున్నాయి.

రోడ్డు ప్రక్కన పచ్చని పొలాలను దాటి ఊళ్ళోకి చేరుకున్న విషయం గమనించలేదు ఆ ముగ్గురూ... ఊరి పొలిమేరల్లోనే "వినాయకుడు మట్టి

వినయకుడు మట్టి...." అంటూ తట్టలతో బిలాబిలా పిల్లలు వచ్చి కారుకు అడ్డం వచ్చారు. రవి కారును స్లోచేసాడు. కిరణ్ మట్టి బొమ్మలను చూస్తూ ఎంతోమహిమగలవి ఈ మట్టి బొమ్మలు అని అనుకున్నాడు మనసులో. కారు ఊరిమధ్యలోకి చేరుకునేసరికి రంగురంగుల్లో ప్లాస్టర్ఆఫ్ పారిస్‌తో చేసిన పెద్ద వినాయకుడి విగ్రహం కనపడింది. కిరణ్ కి ఆ విగ్రహంలో ప్రపంచం అంతా పోటీ పడుతూ కాలుష్యానికి కారణమవుతున్న అగ్రనాయకుల దృశ్యం గోచరించింది. నగరీకరణ పల్లెల్లోకి ఎలా చొచ్చుకు వచ్చిందో స్పష్టమై మట్టివినాయకుడితో "దాన్ని ఎలాగైనా అడ్డుకోవాలి" అనుకున్నాడు మనుసులో. వినాయకుడిని మట్టితో చేసి పల్లకిలో ఊరేగించాలి అంటూ ఏదో అస్పష్టంగా తనలో తాను అనుకుంటూ తాతయ్య ఇంటిగుమ్మంముందు కాలుపెట్టాడు. అప్పుడే గడపబయటకు వచ్చిన మేనమామ కూతురు మేఘన మట్టివినాయకుడ్ని కొన్నది ఎదురుగా వున్న రోడ్లకూడలిలో అంతెత్తున పెట్టిన వినాయకుడు ముఖం వంచి జాలిగా భక్తజనాన్ని చూస్తుంటే మేఘన చేతిలోని మట్టివినాయకుడి మోములోని చిరుదరహాసం శాస్వితవిజయం నాదేఅన్నట్లు చూస్తోంది.

ది:24-08-2008.


SINGARENI COLLIERIES WOMEN'S DEGREE COLLEGE